


# కరపత్రం

SINCE 2014

బుధవారం మార్చి 11, 2026 | సంపుటి : 2 | సంచిక : 150 | - శివప్రసాద్, మేనేజింగ్ ఎడిటర్ | పేజీలు :4



### మూడేళ్లలో పంచాయితీలకు

# శాశ్వత భవనాలు

» హాస్టళ్లు, గురుకులాల అభివృద్ధికి నిధుల మంజూరు

» వివిధ శాఖల అధికారులతో డిప్యూటి సిఎం భట్టి సమీక్ష

**హైదరాబాద్,మార్చి10 :** రాబోయే మూడేళ్లలో శాశ్వత భవనాలు లేని అన్ని గ్రామ పంచాయతీలకు కొత్త భవనాలు నిర్మిస్తామని ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క తెలిపారు. బడ్జెట్‌ను పురస్కరించుకుని మంగళవారం వివిధ శాఖల అధికారులు, మంత్రులతో డిప్యూటీ సీఎం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా బీసీ సంక్షేమ శాఖ అధికారులతో సమావేశమై, హాస్టళ్లు, గురుకులాల అభివృద్ధికి నిధుల మంజూరుపై సమీక్షించారు. 'తహసీల్దార్, ఎంపీడీవో కార్యాలయాలు కలిపి నిర్మించే అవకాశాలు పరిశీలించాలని అన్నారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారుల ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి పెట్టాలి. అదే విధంగా అడ్వాన్స్ టెక్నాలజీ సెంటర్లలో ఉపాధి కల్పించే కోర్సులు ప్రవేశపెట్టాలి. గ్లోబల్ సమ్మిట్‌లో ఒప్పందం కుదుర్చుకున్న కంపెనీలతో ఏటీసీ కోర్సులు ప్రారంభిస్తాము. ఏజెన్సీ ప్రాంతాల్లో ఇసుక మైనింగ్ ట్రైబల్ ఏజెన్సీల ద్వారానే జరగాలని భట్టి విక్రమార్క వెల్లడించారు. ఐటీడీఏల సహకారంతో గిరిజనులను పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దాలి. తెలంగాణ పర్యాటక రంగాన్ని ఉన్నత స్థాయికి తీసుకెళ్లాలి. కవ్వాల్, శ్రీశైలం టైగర్ జోన్ల అభివృద్ధిపై ప్రత్యేక ప్రణాళికలు రూపొందించాలి. ప్రభుత్వం ఎకో టూరిజం, టెంపుల్ టూరిజం అభివృద్ధిపై చర్యలు తీసుకుంటుంది. డ్రగ్స్ మహమ్మారి నివారణకు గ్రామస్థాయిలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలి. డ్రగ్స్ దుష్ప్రభావాలపై కళారూపాల ద్వారా యువతకు అవగాహన కల్పించాలి' అని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క తెలిపారు. ఇదిలావుంటే రాష్ట్రంలో పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధి వ్యవస్థను మరింత బలోపేతం చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని మంత్రి సీతక్క స్పష్టం చేశారు. గ్రామాల అభివృద్ధి, ప్రజలకు మెరుగైన మౌలిక సదుపాయాలు కల్పించడం, గ్రామస్థాయిలో ప్రజాప్రతినిధుల పాత్రను బలోపేతం చేయడం ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో బ్జడెట్ వినియోగం, వచ్చే ఏడాది బ్జడెట్ ప్రతిపాదనలపై విస్తృతంగా చర్చించారు.



# పారదర్శక సేవలే లక్ష్యం

» భూముల రీ-సర్వే కోసం ఆధునిక 'రోవర్ల' కొనుగోలు

» డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కతో బ్జడెట్ సన్నాహక సమావేశం

**హైదరాబాద్,మార్చి10 :** రాష్ట్రంలో భూ లావాదేవీలను మరింత పారదర్శకంగా నిర్వహించి, ప్రజలకు ముఖ్యంగా రైతులకు అత్యుత్తమ సేవలు అందించడమే ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి స్పష్టం చేశారు. మంగళవారం సచివాలయంలో ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క అధ్యక్షతన జరిగిన 2026-27 బడ్జెట్ సన్నాహక సమావేశంలో మంత్రి పాల్గొన్నారు. సందర్భంగా రెవెన్యూ, హౌసింగ్, సమాచార శాఖలకు సంబంధించిన బ్జడెట్ ప్రతిపాదనలను సమర్పిస్తూ మంత్రి పలు కీలక అంశాలను వెల్లడించారు: భూ సమస్యల పరిష్కారంలో జాప్యాన్ని నివారించడానికి రెవెన్యూ, స్టాంప్స్ / రిజిస్ట్రేషన్, సర్వే విభాగాలను ఒకే గొడుగు కిందకు తీసుకువస్తున్నట్లు మంత్రి తెలిపారు. ఇందుకోసం ఒక ప్రత్యేక పోర్టల్‌ను అందుబాటులోకి తీసుకురానున్నట్లు వివరించారు. పాత పద్ధతులకు స్వస్తి చెప్పి, అత్యాధునిక 'రోవర్' పరికరాలతో భూముల సర్వే నిర్వహించనున్నట్లు మంత్రి ప్రకటించారు. ఇప్పటికే మండలానికి ఒకటి చొప్పున 460 రోవర్లను కొనుగోలు చేశామని తెలిపారు. వచ్చే బ్జడెట్‌లో మరో 400 రోవర్ల కొనుగోలుకు ప్రతిపాదనలు సిద్ధం చేశామన్నారు. రాష్ట్రంలో నక్షా (మ్యాప్) లేని 373 గ్రామాల్లో త్వరలోనే రీ-సర్వే చేపట్టబోతున్నామని, ఇందుకు సంబంధించి 2026-27 బ్జడెట్‌లో తగిన నిధులు కేటాయించాలని ఉప ముఖ్యమంత్రిని కోరారు. తహశీల్దార్ కార్యాలయాలకు శాశ్వత ప్రభుత్వ భవనాలను నిర్మించనున్నట్లు మంత్రి తెలిపారు. ప్రజా పరిపాలన సౌలభ్యం కోసం వీటికి అవసరమైన బ్జడెట్ కేటాయింపులు జరపాలని విజ్ఞప్తి చేశారు. సమావేశంలో రెవెన్యూ మరియు ఆర్థిక శాఖల ఉన్నతాధికారులు పాల్గొని శాఖల వారీగా నిధుల అవసరాలపై చర్చించారు.




## మిలియన్ మార్చ్‌కు 15 ఏళ్లు

▪ ఉద్యమ ప్రస్తానంలో కీలక ఘట్టం :కెటిఆర్ ట్వీట్

**హైదరాబాద్,మార్చి10** స్వరాష్ట్ర సాధన కోసం ట్యాంక్‌బండ్‌పై యావత్ తెలంగాణ ప్రజలు ఏకమై గర్జించి నేటికి 15 ఏళ్లు పూర్తయిందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ గుర్తుచేశారు. స్వరాష్ట్ర సాధన కోసం నాడు ఉద్యమ ప్రస్థానం

2లో..



## భూ ఆక్రమణలపై పిడి యాక్ట్ ఏమయ్యింది

» దురాక్రమణదారులపై దమ్ముంటే చర్య తీసుకోవాలి

» గీతం వర్సిటీ భూ ఆక్రమణలపై చర్యలు తీసుకోవాల్సిందే

» సిపిఎ కార్యదర్శి శ్రీనివాసరావు డిమాండ్

**విజయవాడ,మార్చి10 :** అతి పెద్ద భూ దురాక్రమణదారు ప్రభుత్వమేనని సిపిఎం విమర్శించింది.

## సృష్టి సరోగసీ కేసు..

# రూ.29.76 కోట్ల ఆస్తులు జప్తు

**సికింద్రాబాద్:** తెలుగు రాష్ట్రాల్లో సంచలనం సృష్టించిన సృష్టి ఫెర్టిలిటీ సరోగసీ కేసులో ఈడీ తన దర్యాప్తును వేగవంతం చేసింది. డాక్టర్ నమ్రత కుటుంబానికి చెందిన రూ.29.76 కోట్ల విలువైన స్థిరాస్తులను జప్తు చేసింది. బహిరంగ మార్కెట్‌లో వీటి విలువ రూ.50 కోట్లకుపైగా ఉంటుందని అంచనా. నమ్రత 2014 నుంచి అక్రమ సరోగసీలు చేస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి.





## ఘనంగా గోదావరి పుష్కరాలు.. తేదీలు ఖరారు

» కుంభమేళా తరహాలో గోదావరి పుష్కరాలు

» 2027 జూన్ 26 నుంచి జూలై 7 వరకు ఆది పుష్కరాలు

» 2028 జూలై 13 నుంచి 24 వరకు అంత్య పుష్కరాలు

» 'తెలంగాణ బ్రాండ్' ప్రతిబింబించేలా ఏర్పాట్లు

**హైదరాబాద్:** కుంభమేళా తరహాలోనే గోదావరి పుష్కరాలనూ అత్యంత ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించేందుకు ప్రభుత్వం ఏర్పాట్లు చేస్తోందని 'గోదావరి పుష్కరాలు 2027' క్యాబినేట్ సబ్ కమిటీ తెలిపింది. మంగళవారం డా.బీఆర్ అంబేద్కర్ తెలంగాణ సచివాలయంలో రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు అధ్యక్షతన నిర్వహించిన కమిటీ తొలి సమావేశం నిర్వహించింది. సభ్యులు కొండా సురేఖ, తుమ్మల నాగేశ్వర రావు, కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, సీతక్క, అడ్లూరి లక్ష్మణ్ కుమార్, ప్రభుత్వ సలహాదారులు సుదర్శన్ రెడ్డి పాల్గొన్నారు.

మిగతాది 2లో

## పిఠాపురంలో జనసేన ఆవిర్భావ వేడుకలు రద్దు

» ఉమ్మడి జిల్లా, నగరం, మండల, పంచాయితీల్లోనే నిర్వహణ

» మార్పులను ప్రకటించిన జనసేనాని పవన్ కళ్యాణ్



**అమరావతి,మార్చి10** జనసేన పార్టీ ఆవిర్భావ దినోత్సవ వేడుకల్లో మార్పులు చేపట్టినట్లు పార్టీ అధినేత, ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ ప్రకటించారు. ఈ నెల 14వ తేదీన పిఠాపురంలో జరగప తలపెట్టిన రాష్ట్రస్థాయి కార్యక్రమాన్ని రద్దు చేస్తున్నట్లు ప్రకటించారు.

2లో..



2లో..

## రంగానాయక్ సాగర్‌పై ఎందుకీ తాత్సారం

» ఆందోళన చేస్తున్న రైతుల అరెస్ట్ దుర్మార్గం

» మండిపడ్డ కేంద్రమంత్రి బండి సంజయ్

**హైదరాబాద్,మార్చి10 :** రాజన్న సిరిసిల్ల జిల్లాలో రంగనాయక్ సాగర్ కెనాల్ పనులు పూర్తి చేయాలంటూ నిరసనకు దిగిన రైతులను అరెస్ట్ చేయడాన్ని కేంద్రమంత్రి బండి సంజయ్ ఖండించారు. సమస్యలపై ఆందోళన చేస్తే అరెస్ట్ చేస్తారా అని ప్రశ్నించారు. ఇదేనా ప్రజాప్రభుత్వం తీరు అంటూ విమర్శలు గుప్పించారు. మంగళవారం కేంద్రమంత్రి మీడియాతో మాట్లాడుతూ.. ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని రైతులు నిరసన చేస్తే వారిని అరెస్ట్ చేస్తారా



## కిషన్‌రెడ్డి, బండి సంజయ్‌లకు పొన్నం బహిరంగ లేఖ

**హైదరాబాద్:** తెలంగాణ రాష్ట్రానికి ఇచ్చిన హామీలు అమలు చేయడంలో కేంద్ర ప్రభుత్వం నిర్లక్ష్యం ప్రదర్శిస్తోందని, ఎన్నికల వేళ ఇచ్చిన హామీలను నెరవేర్చాలని తెలంగాణ మంత్రి పొన్నం ప్రభాకర్ డిమాండ్ చేశారు. కేంద్రం నుంచి వచ్చే నిధులు కేంద్రం దయ కాదు.. తెలంగాణ హక్కు. అని తెలంగాణ ప్రజలు పన్నులు చెల్లిస్తున్నప్పుడు కేంద్ర ప్రభుత్వం తెలంగాణ ప్రజల అభివృద్ధి కోసం ఎందుకు చర్యలు చేపట్టడం లేదని ప్రశ్నించారు. ఈ మేరకు కేంద్ర మంత్రులు కిషన్‌రెడ్డి, బండి సంజయ్‌లకు బహిరంగ లేఖ రాశారు.

'పార్లమెంట్ లో జరుగుతున్న కేంద్ర బడ్జెట్ చర్చలో తెలంగాకి సంబంధించిన రావాల్సిన నిధులు, పెండింగ్ ప్రాజెక్ట్ లపై కేంద్ర మంత్రులు బండి సంజయ్, కిషన్‌రెడ్డిలు చర్చించాలి.

## ఫోన్ ట్యాపింగ్ కేసు.. ప్రభాకర్ రావుకు బెయిల్

**హైదరాబాద్:** ఫోన్ ట్యాపింగ్ కేసులో కీలక పరిణామం చోటు చేసుకుంది. ఈ కేసులో నిందితుడిగా ఉన్న ప్రభాకర్ రావుకు సుప్రీంకోర్టు బెయిల్ మంజూరు చేసింది. విచారణకు సహకరించాలని పాస్‌పోర్టు ట్రయల్ కోర్టులో సరెండర్ చేయాలని ఆదేశించింది. రాష్ట్ర స్పెషల్ ఇంటెలిజెన్స్ బ్యూరో (ఎస్ఐబీ) కార్యాలయం కేంద్రంగా సాగిన ఫోన్ ట్యాపింగ్ కేసులో ప్రధాన నిందితుడైన ఎస్ఐబీ మాజీ చీఫ్ ప్రభాకర్‌రావు.. సుప్రీంకోర్టులో ఇది వరకే ముందస్తు బెయిల్ పిటిషన్ దాఖలు చేశారు.



మిగతాది 2లో

# భూ ఆక్రమణలపై పిడి యాక్ట్ ఏమయ్యింది

మొదటి పేజీ తరువాయి

ప్రభుత్వ, పేదల భూములాక్రమించిన పెత్తందారులపై చర్యలు తీసుకోవాలని సిపిఐ(యం) డిమాండ్ చేసింది. దీనికి సంబంధించి మంగళవారం సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు ఓ ప్రకటనను విడుదల చేశారు. భూ అక్రమాలకు పాల్పడితే పీడీ యాక్ట్ పెడతామని హెచ్చరించిన ముఖ్యమంత్రి భూ దురాక్రమణలకు పాల్పడిన పెత్తందార్లు, కార్పొరేట్లు, ప్రజా ప్రతినిధులపై చర్య తీసుకొని తన చిత్తశుద్ధిని నిరూపించుకోవాలని సిపిఐ(యం) రాష్ట్ర కమిటీ డిమాండ్ చేస్తున్నదన్నారు. ' మీ భూమి మీ హక్కు అంటున్న చంద్రబాబు నాయుడు గారు ఆచరణలో 'మీ భూమి మా హక్కు ' అన్నట్లుగా వ్యవహరిస్తున్నారని ఎద్దేవా చేశారు. అవసరం వున్నా లేకున్నా అభివృద్ధి జపం చేస్తూ వేలాది ఎకరాలను రైతుల నుండి వారి ఇష్టా ఇష్టాలతో నిమిత్తం లేకుండా సర్కార్ బలవంతంగా గుంజుకుంటున్నదని ధ్వజమెత్తారు. ప్రశ్నించిన వారిపై పీడీ యాక్ట్ పెడుతున్నారని అన్నారు. తప్పుడు కేసులు బనాయిస్తున్నారని చెప్పారు. రైతులను, కూలీలను, ఉత్పత్తిదారులను బెదిరిస్తున్నారని దుయ్యబట్టారు. ప్రభుత్వానికి ధైర్యం ఉంటే ? ఈ నిరంకుశ పద్ధతులకు స్వస్తి చెప్పి దురాక్రమణకు పాల్పడుతున్న బడా వ్యక్తులపై చర్యలు తీసుకోవాలని కోరారు. విశాఖ గీతం యూనివర్సిటీ యాజమాన్యం ప్రభుత్వ భూమిని కబ్జా చేసినా ఏమి చర్యలు తీసుకున్నారు ? అని ప్రశ్నించారు. కానీ రైతుల భూముల కోసం పోరాడుతున్న అప్పలరాజును పిడియాక్టు కింద జైలుకు పంపించిన ఘనత చంద్రబాబు ప్రభుత్వానిది అని మండిపడ్డారు. ఇలాంటివి చాలా ఉదారణలున్నాయని తెలిపారు. పరిశ్రమలు పెట్టి ఉపాధి కల్పిస్తామని నమ్మబలికి ఏళ్ళు గడుస్తున్నా పరిశ్రమలు పెట్టకుండా భూములను తాకట్టు పెట్టి బ్యాంకు రుణాలు తీసుకొని ఎగ్గొట్టినవారు, పరిశ్రమలు పెట్టకుండా రియల్ ఎస్టేటుకు మళ్లించిన వారిపై చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలని సిపిఐ(యం) రాష్ట్ర కమిటీ డిమాండ్ చేస్తున్నదన్నారు. ఏజెన్సీ ప్రాంతంలో గిరిజనేతర భూస్వాములు అధికారులతో కుమ్మక్కై అక్రమంగా భూములు తమ స్వాధీనంలో పెట్టుకున్నారని ఆరోపించారు. గిరిజన పేదలకు న్యాయం దొరకడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. నలభై యాభై సంవత్సరాలుగా దళితులు తదితర నిరుపేదలు సాగు చేసుకుంటున్న అసైన్డ్ భూములను పెత్తందార్లు లాగేసుకున్నారని ఆగ్రహాన్ని వ్యక్తం చేశారు. ప్రభుత్వం పేదల భూ హక్కులను గుర్తించడం లేదు అని చెప్పారు. రొయ్యలు, చేపల చెరువులకు బినామీగా అసైన్డ్ భూములు మారిపోయాయన్నారు. దీర్ఘకాలంగా 22 ఏ కింద పేద, మధ్య తరగతి రైతుల భూములను వివాదంగా మార్చిన వాటిపై అధికారుల చుట్టూ కాళ్లరిగేటట్లు తిరుగుతున్నా పరిష్కారం కావడం లేదని వివరించారు. ఏడాదిలోగా పరిష్కరిస్తామని వాగ్దానం చేసిన చంద్రబాబు ప్రభుత్వం రెండేండ్లయినా పరిష్కరించడంలో విఫలమైందని, ఇప్పుడు మళ్లీ ఇంకో సంవత్సరం అంటున్నారు? దీనికి అత్యంత ప్రాధాన్యత ఇచ్చి జూన్‌లోగా పరిష్కరించాలని సిపిఐ(యం) కోరుతున్నదని వి.శ్రీనివాసరావు పేర్కొన్నారు.

# రంగానాయక్ సాగర్‌పై ఎందుకీ తాత్సారం

మొదటి పేజీ తరువాయి

అంటూ మండిపడ్డారు. రంగనాయక్ సాగర్ నుంచి పెద్దలింగాపూర్, తంగళ్లపల్లి మండలానికి నీళ్లిచ్చే కాలువ పనులను ఎందుకు పూర్తి చేయడం లేదని కేంద్రమంత్రి ప్రశ్నించారు. రూ.3 కోట్ల నిధులు విడుదలయ్యాయని స్థానిక ఎమ్మెల్యే ప్రకటించి ఏడాది దాటినా పనులు ఎందుకు ప్రారంభించలేదని అడిగారు. కాలువ పనులు పూర్తి చేసి ఉంటే 9,500 ఎకరాలకు సాగునీరు అందేదని ఆయన స్పష్టం చేశారు. అధికారంలో ఉన్నన్నాళ్లు రంగనాయక్ సాగర్ ద్వారా సిరిసిల్ల జిల్లాకు నీరివ్వని కేటీఆర్ రైతు ద్రోహి అని బండి సంజయ్ ఆరోపించారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ పాలకుల వైఫల్యాల వల్ల రైతులు వరుసగా పంటలు నష్టపోతున్నారని కేంద్రమంత్రి అన్నారు. తక్షణమే పనులు ప్రారంభించకపోతే ఆయా ప్రాంత రైతులు తీవ్రంగా నష్టపోయే ప్రమాదం ఉందని ఆయన హెచ్చరించారు. న్యాయం చేయాలని అడిగిన రైతులను అరెస్ట్ చేయడం అన్యాయమన్నారు. రైతులకు సంఘీభావం తెలిపిన బీజేపీ జిల్లా అధ్యక్షులు గోపీ సహా పార్టీ నాయకులను స్టేషన్‌కు తరలించడం అక్రమమని కేంద్రమంత్రి తీవ్రంగా మండిపడ్డారు. రైతులపై కేసులు నమోదు చేస్తే తీవ్ర పరిణామాలు ఉంటాయని హెచ్చరించారు. తక్షణమే రైతులను, బీజేపీ నేతలను బేషరతుగా విడుదల చేయాలన్నారు. రంగనాయక్ సాగర్ 11వ ప్యాకేజీ నుంచి ఎల్ఎం 4, ఎల్ఎం 6 ద్వారా కాలువ పనులను పూర్తి చేయాలని కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్ డిమాండ్ చేశారు.

# పిఠాపురంలో జనసేన ఆవిర్భావ వేడుకలు రద్దు

మొదటి పేజీ తరువాయి

ఎండల తీవ్రత కారణంగా పిఠాపురం ఆవిర్భావ సభను రద్దు చేస్తూ నిర్ణయం తీసుకున్నట్లు పవన్ కళ్యాణ్ వివరించారు. ఈసారి ఆవిర్భావ దినోత్సవ వేడుకలను ఉమ్మడి జిల్లా, నగరం, మండల కేంద్రం, పంచాయతీల్లో ఘనంగా నిర్వహించాలని పవన్ కళ్యాణ్ పిలుపునిచ్చారు. మార్చి 14 జనసైనికులకు, వీర మహిళలకు, పార్టీ నాయకులకు పండగ లాంటి రోజని ఈ సందర్భంగా డిప్యూటీ సీఎం అన్నారు. పార్టీ పతాక ఆవిష్కరణ కార్యక్రమాన్ని జనసైనికులు, వీర మహిళలు, నాయకులు, ఉద్యమ సభ్యత్వం పొందినవారి సమక్షంలో ఎగురవేయాలని సూచించారు. పార్టీ సైద్ధాంతిక బలం, రాష్ట్ర అభివృద్ధికి కట్టుబడి ఏ విధంగా ముందుకు వెళ్తుందో పార్టీ శ్రేణులకు, ప్రజలకు వివరించాలన్నారు. ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా సేవా కార్యక్రమాలు చేపట్టాలని జనసేన అధినేత పిలుపునిచ్చారు. రక్తదాన శిబిరాలు, ఆహార వితరణ, పర్యావరణ సంబంధిత కార్యక్రమాలు నిర్వహించాలని పవన్ సూచించారు. ఎండల తీవ్రత నేపథ్యంలో రాష్ట్ర స్థాయి కార్యక్రమాన్ని మార్చినట్లు జనసేన అధినేత తెలిపారు. ఈ దఫా జనసేన పార్టీ ఆవిర్భావ వేడుకలను రాష్ట్ర స్థాయిలో పిఠాపురంలో నిర్వహించాలని తొలుత నిర్ణయించామని.. వాతావరణ పరిస్థితులు ప్రతికూలంగా ఉంటాయనే రిపోర్టులను పరిగణనలోకి తీసుకుని.. అందుకు అనుగుణంగా వేడుకల నిర్వహణ స్వరూపాన్ని మార్చామని వివరించారు. ఆవిర్భావ వేడుకలను రాష్ట్ర స్థాయి కార్యక్రమంగా కాకుండా జిల్లా, సిటీ, మండల కేంద్రాల్లో నిర్వహిస్తున్నామన్నారు. కార్యకర్తల్లో ఉన్న ఉత్సాహాన్ని కొనసాగించేలా ఎక్కడికక్కడ స్థానికంగా వేడుకలను ఘనంగా నిర్వహించాలని డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ ఆదేశించారు.

# ఫోన్ ట్యాపింగ్ కేసు.. ప్రభాకర్ రావుకు బెయిల్

మొదటి పేజీ తరువాయి

దీనిపై విచారించిన కోర్టు షరతులతో కూడిన బెయిల్ మంజూరు చేసింది. పాస్‌పోర్టు సరెండర్ చేయాలని ట్రయల్ కోర్టు అనుమతి లేకుండా విదేశాలకు వెళ్లకూడదని ఆదేశించింది.

**కేసు నేపథ్యం**

ఎస్ఐబీ అదనపు ఎస్పీ డి.రమేశ్ ఫిర్యాదుతో 2023 మార్చి 10న పంజాగుట్ట పోలీసుస్టేషన్‌లో ఎస్ఐబీ మాజీ డీఎస్పీ ప్రణీత్‌రావు, ఇతరులపై ఐపీసీ, ప్రజా ఆస్తుల విధ్వంసాల నిరోధక చట్టం, ఐటీ చట్టంలోని సెక్షన్ల కింద కేసు నమోదైంది. అందులో ఐపీసీలోని 120 బీ (కుట్ర) సెక్షన్‌ను తొలగించినప్పటికీ నిందితులపై ఫోన్ ట్యాపింగ్ అభియోగాలు దాఖలు చేయాలంటే కచ్చితంగా ఇండియన్ టెలిగ్రాఫ్ యాక్ట్‌లోని సెక్షన్లు వర్తింపజేయాలని న్యాయ నిపుణులు ఉన్నతాధికారులకు సూచించారు. ఈ నేపథ్యంలో డీఎస్పీ దుగ్యాల ప్రణీత్‌రావు అదనపు కస్టడీ, అదనపు ఎస్పీలు నాయిని భుజంగరావు, మేకల తిరుపతన్న కస్టడీ పిటిషన్లతోపాటు ఈ చట్టాన్ని జోడిస్తూ అదే నెల ఆఖరి వారంలో మెమోను కోర్టులో దాఖలు చేయడంతో ఇది ట్యాపింగ్ కేసుగా మారింది.

**ఎస్ఐబీ మాజీ చీఫ్ ప్రభాకర్‌రావు**

ట్యాపింగ్ వ్యవహారంలో తాను పాత్రధారినేనని.. నాటి డీజీపీలుగా, నిఘా విభాగాధిపతులుగా పనిచేసిన అదనపు డీజీపీ పర్యవేక్షణలో ట్యాపింగ్ జరిగినట్లు ప్రభాకర్‌రావు పేర్కొన్నారు. ట్యాప్ చేస్తున్న నంబర్ల పూర్వాపరాలను డీజీపీతోపాటు చీఫ్ సెక్రటరీ, జీఏడీ సెక్రటరీ, లా సెక్రటరీలతో కూడిన కమిటీ సమీక్షిస్తుందని.. వారి అనుమతితోనే అది జరిగిందని స్పష్టం చేశారు. దీంతో ఈ కేసు కీలక మలుపు తిరిగింది.

# ఘనంగా గోదావరి పుష్కరాలు.. తేదీలు ఖరారు

మొదటి పేజీ తరువాయి

'తెలంగాణ బ్రాండ్' మార్మోగేలా... మన సంస్కృతి, సంప్రదాయాలను ప్రతిబింబించేలా శాశ్వత ప్రాతిపదికన పనులు చేపట్టాలని సంబంధిత అధికారులను కమిటీ ఆదేశించింది. పుష్కర నిర్వహణ తేదీలు, సంబంధిత శాఖల సన్నద్ధత, భవిష్యత్తు కార్యాచరణను సమీక్షించి అధికారులకు దిశా నిర్దేశం చేశారు. అనంతరం మంత్రులు మాట్లాడుతూ.... సీఎం రేవంత్ రెడ్డి నేతృత్వంలోని ప్రజా ప్రభుత్వం సరస్వతీ పుష్కరాలు, సమ్మక్క సారక్క జాతరను అత్యంత వైభవోపేతంగా నిర్వహించిందన్నారు. అదే స్ఫూర్తితో... మరింత రెట్టించిన ఉత్సాహంతో రాబోయే గోదావరి పుష్కరాలనూ అత్యంత ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నామన్నారు.

2027 జూన్ 26 నుంచి జూలై 7 వరకు ఆది పుష్కరాలు, 2028 జూలై 13 నుంచి 24 వరకు అంత్య పుష్కరాలను నిర్వహించాలని వేద పండితులు నిర్ణయించారన్నారు. సుమారు 8 కోట్ల మంది భక్తులు ఈ పుష్కరాలకు తరలి వచ్చే అవకాశముందని, అందుకు అనుగుణంగానే గోదావరి ప్రవహించే జిల్లాల్లో... ప్రముఖ దేవాలయాలను అనుసంధానిస్తూ... 96 ప్రాంతాలను పుష్కరాల కోసం ప్రత్యేకంగా ఎంపిక చేశామన్నారు. గత పుష్కరాల అనుభవాలను దృష్టిలో ఉంచుకుని ఆయా చోట్ల క్షేత్రస్థాయి వాస్తవ పరిస్థితులకు అనుగుణంగా ఘాట్లు, రోడ్లు, ఇతర మౌలిక సదుపాయాల అభివృద్ధికి రాష్ట్ర, జిల్లా ప్రణాళికలను ప్రత్యేకంగా రూపొందిస్తున్నామన్నారు.

తొలి దశలో భాగంగా యుద్ధ ప్రాతిపదికన పనులు చేపట్టేందుకు రద్దీ అధికంగా ఉండే తొమ్మిది ప్రాంతాలను 'టైర్ -- 1' కింద ఎంపిక చేశామన్నారు. సమన్వయలోపం తలెత్తకుండా గోదావరి పుష్కరాల నిర్వహణకు ప్రత్యేకంగా స్పెషల్ ఆఫీసర్, శాఖల వారీగా నోడల్ అధికారులను నియమిస్తామన్నారు. ప్రతి ఘాట్ దగ్గర ట్రాఫిక్ క్రమబద్దీకరణ, ఎమర్జెన్సీ రూట్, అత్యాధునిక వైద్య సౌకర్యాలు, పార్కింగ్ తదితర అంశాలపై ప్రధానంగా దృష్టి సారించామన్నారు. ఎలాంటి లోటుపాట్లు తలెత్తకుండా అత్యంత పకడ్బందీగా వ్యవహరించాలని అధికారులను ఆదేశించారు.

# మూడేళ్లలో పంచాయితీలకు శాశ్వత భవనాలు

మొదటి పేజీ తరువాయి

విభాగాల వారీగా అధికారులు బడ్జెట్ ప్రతిపాదనలు సమర్పించగా వాటిలో పలు మార్పులు చేయాలని అధికారులకు సూచించారు. అలాగే ఈ ఆర్థిక సంవత్సరం ముగిసే లోపు కేంద్ర ప్రభుత్వం నుంచి రాష్ట్రానికి రావాల్సిన నిధులను పూర్తి స్థాయిలో విడుదల చేయించుకోవాలని అధికారులను ఆదేశించారు. ఒక్క రూపాయి కూడా. పెండింగ్ పడకుండా, వెనక్కి పోకుండా అవసరమైన చర్యలు తీసుకోవాలని నిర్దేశిరచారు. గత ప్రభుత్వ నిర్ణయాల కారణంగా గ్రామాలకు కేంద్ర నిధులు చాలా వరకు పెండింగ్లో ఉన్నాయని, ఈనేపథ్యంలో రాష్ట్రానికి హక్కుగా రావాల్సిన వాటాను సాధించాలని అధికారులకు దిశానిర్దేశర చేశారు. కేంద్రానికి రాష్ట్రం భారీగా పన్నులు చెల్లిస్తున్న నేపథ్యంలో రాష్ట్రానికి రావాల్సిన నిధులను సమర్థంగా సాధించుకోవాలని మంత్రి పేర్కొన్నారు. ప్రతి రూపాయిని జాగ్రత్తగా ఖర్చు చేస్తే అభివృద్ధికి ఎలాంటి ఆటంకాలు ఉండవన్నారు. ముఖ్యంగా కేంద్రం నుంచి రావాల్సిన 15వ ఆర్థిక సంఘం నిధులు పెండింగ్లో ఉన్నాయని, అవసరమైన యుటిలిటీ సర్టిఫికెట్లు సమర్పించి వాటిని త్వరగా విడుదల చేయించు కోవాలన్నారు. 99 రోజుల ప్రణాళికల్లో పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ నంబర్ వన్ స్థానంలో నిలవాలని ఆకాంక్షించారు. జిల్లాల వారీగా నిర్మాణంలో ఉన్న ఇందిరా మహిళా శక్తి భవనాలను త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులను మంత్రి ఆదేశించారు. తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవం జూన్ 2 నాటికి ఈ భవ నాలను ప్రారం భించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఆనంతరం వాటర్ షెడ్ డెవలప్మెంట్ కార్యక్రమంపై మంత్రి సమీక్ష నిర్వహించారు. ఆదివాసి, ఏజన్సి, గిరిజన ప్రాంతాల్లో అనేక వాగులు ఉన్నప్పటికీ వేసవికాలంలో సాగు, తాగునీటి సమస్యలు తలెత్తుతున్నాయని మంత్రి పేర్కొన్నారు.

# కిషన్‌రెడ్డి, బండి సంజయ్‌లకు పొన్నం బహిరంగ లేఖ

మొదటి పేజీ తరువాయి

ఎన్నికలు, రాజకీయాలు వేరు. రాష్ట్ర అభివృద్ధి పై వివక్ష వద్దు. కేంద్ర మంత్రులు కిషన్ రెడ్డి , బండి సంజయ్‌లు కేంద్రంతో కొట్లాడి రాష్ట్రానికి నిధులు సాధించాలి. తెలంగాణ ప్రజల న్యాయమైన డిమాండ్లను ఇంకా విస్మరించడం తగదు. తెలంగాణ ఏర్పడి 12 ఏళ్లు గడిచినా విభజన చట్టం హామీలు అమలు చేయడంలో కేంద్రం దారుణంగా విఫలమైంది' అని విమర్శించారు.

# మిలియన్ మార్చ్‌కు 15 ఏళ్లు

మొదటి పేజీ తరువాయి

ఉవ్వెత్తున ఎగిసిందని, తెలంగాణ ఉద్యమాన్ని ఉవ్వెత్తున ఎగిసేలా చేసిన కీలక ఘట్టాల్లో మిలియన్ మార్చ్ ఒకటని ఆయన పేర్కొన్నారు. 2011 మార్చి 10న మిలియన్ మార్చ్ సందర్భంగా నిర్బంధాలు, దిగ్బంధాలు, అడ్డంకులు, బ్యారికేడ్‌లు, ఇనుపకంచెలు ఇవేవీ తెలంగాణ ఉద్యమకారుల స్ఫూర్తిని దెబ్బతీయలేకపోయాయని కేటీఆర్ ఎక్స్ ఖాతాలో రాసుకొచ్చారు. లక్షల గొంతుకలు తెలంగాణ రాష్ట్రం కోసం ట్యాంక్‌బండ్‌పై నినదించిన అద్భుత పోరాట రూపానికి నేటితో 15
ఏళ్లు పూర్తయ్యాయని పేర్కొన్నారు. తెలంగాణ అమరవీరులకు జోహార్లు, జై తెలంగాణ అంటూ తన పోస్టును ముగించారు. ఈ పోస్టుకు మిలియన్ మార్చి నాటి కొన్ని ఫొటోలను షేర్ చేశారు. కింది పోస్టులో ఆ ఫొటోలను మీరూ చూడవచ్చు..

# ఎప్రిల్ 2,3 తేదీల్లో టెక్స్‌టైల్ కాన్ఫరెన్స్

**బ్రోచర్ ఆవిష్కరించిన మంత్రులు**

:హైదరాబాద్‌లో జరగనున్న 13వ ఆసియన్ టెక్స్‌టైల్ కాన్ఫరెన్స్ కు సంబంధించిన బ్రోచర్‌ను రాష్ట్ర మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు ,దుద్దిళ్ల శ్రీధర్ బాబులు కలసి విడుదల చేశారు. సందర్భంగా మంత్రులు మాట్లాడుతూ, తెలంగాణను దేశంలోనే కాక ప్రపంచ స్థాయిలో టెక్స్‌టైల్ రంగంలో ప్రధాన కేంద్రంగా అభివృద్ధి చేయడమే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. హైదరాబాద్‌లో జరిగే సదస్సు ద్వారా దేశీయ-అంతర్జాతీయ టెక్స్‌టైల్ పరిశ్రమల ప్రతినిధులు, పెట్టుబడిదారులు, నిపుణులు ఒకే వేదికపైకి రావడం ద్వారా తెలంగాణలో టెక్స్‌టైల్ రంగానికి మరింత ప్రోత్సాహం లభిస్తుందని పేర్కొన్నారు. అంతర్జాతీయ సమావేశాన్ని తెలంగాణ ప్రభుత్వం ఏప్రిల్ 2
మరియు 3 తేదీల్లో హైదరాబాద్‌లో లో నిర్వహించనుంది.మావేశంలో టెక్స్‌టైల్ రంగంలో సస్టైనబిలిటీ, సాంకేతికత, సరఫరా వ్యవస్థల అభివృద్ధి, గ్లోబల్ మార్కెట్ల అవకాశాలు వంటి అంశాలపై చర్చలు జరగనున్నాయి. అదనంగా, ఏప్రిల్ 4న వరంగల్‌లోని పరిశ్రమల సందర్శన కూడా నిర్వహించనున్నారు.

సమావేశం ద్వారా తెలంగాణను టెక్స్‌టైల్, అపారెల్ మరియు ఫుట్‌వేర్ తయారీకి అంతర్జాతీయ పెట్టుబడుల కేంద్రంగా నిలబెట్టాలని రాష్ట్ర ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకున్నట్లు మంత్రి తెలియజేశారు.

# మంత్రి పొంగులేటితో వేం నరేందర్ భేటీ

రాజ్యసభ సభ్యునిగా ఎన్నికైన వేం నరేందర్ రెడ్డి మంగళవారం రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార, పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డిని ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. సందర్భంగా మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, రాజ్యసభ సభ్యునిగా ఎన్నికైన వేం నరేందర్ రెడ్డికి హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. ప్రజాసేవలో ఆయనకు ఉన్న అనుభవం, నిబద్ధత మరియు అంకితభావం తెలంగాణ గళాన్ని దేశ రాజధానిలో బలంగా వినిపించడానికి ఎంతో దోహదపడతాయని మంత్రి ఆకాంక్షించారు.÷ాజ్యసభలో ఆయన పార్లమెంటరీ ప్రస్థానం విజయవంతంగా సాగుతూ, ప్రజలకు మరింత సేవ చేసే అవకాశం కలగాలని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి మనస్ఫూర్తిగా ఆకాంక్షించారు.

# బాసర నుంచి భద్రాచలం వరకు అభివృద్ధికి ప్రణాళికలు

**– గోదావరి పుష్కరాల కేబినెట్ సబ్ కమిటీ సమావేశంలో మంత్రి పొంగులేటి**

వచ్చే ఏడాది జరుగనున్న గోదావరి పుష్కరాల నేపథ్యంలో బాసర నుంచి భద్రాచలం వరకు గోదావరి పరివాహక ప్రాంతంలో ఉన్న అన్ని ప్రధాన ఆలయాలు, పురాతన ఆలయాలను అభివృద్ధి చేసేలా ప్రణాళికలు తయారు చేయాలని రాష్ట్ర రెవెన్యూ హౌసింగ్, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి అధికారులను ఆదేశించారు. మంత్రి శ్రీధర్ బాబు అధ్యక్షతన మంగళవారం సచివాలయంలో జరిగిన గోదావరి పుష్కరాల కేబినెట్ సబ్ కమిటీ సమావేశంలో మంత్రి పొంగులేటి మాట్లాడుతూ రాష్ట్రంలోని ప్రముఖ దేవాలయాల అభివృద్ధికి సమగ్ర రోడ్ల అనుసంధానం కల్పించే విధంగా ప్రత్యేక ప్రణాళిక రూపొందించాలని అధికారులకు సూచించారు. రాష్ట్రంలో ఉన్న ప్రముఖ దేవాలయాలను ప్రధాన రహదారులతో అనుసంధానం చేసే విధంగా ఒక సమగ్ర మాస్టర్ ఎ÷-లాన్ రూపొందించాలని మంత్రి పేర్కొన్నారు. అవసరమైన చోట రోడ్ల నిర్మాణం, అభివృద్ధి కోసం ఎంత మేర నిధులు అవసరమో ఆర్థిక పరమైన అంశాలను కూడా పరిగణనలోకి తీసుకొని ప్రతిపాదనలు సిద్ధం చేయాలని అధికారులకు సూచించారు. బాసర, భద్రాచలం, కొండగట్టు ఆంజనేయ స్వామి దేవాలయం వంటి ప్రసిద్ధ క్షేత్రాలే కాకుండా మధ్యలో ఉన్న ఇతర ప్రముఖ దేవాలయాలకు కూడా సౌకర్యవంతమైన రోడ్ల కనెక్టివిటీ కల్పించాలనే ఉద్దేశంతో ఈ ప్రణాళిక రూపొందించాలని మంత్రి తెలిపారు. ప్రధాన రహదారులతో దేవాలయాలను అనుసంధానం చేస్తూ ఒకేసారి సమగ్ర ప్రణాళిక అమలు చేసేలా చర్యలు తీసుకోవాలని అన్నారు.బాసర దేవాలయానికి ఇప్పటికే మాస్టర్ ఎ÷-లాన్ ఆమోదం ఉన్నందున, భద్రాచలం దేవస్థానం మాస్టర్ ఎ÷-లాన్ ను కూడా ఈ కమిటీలో చర్చించి ముఖ్యమంత్రి గారి ఆమోదం తీసుకోవాలని అన్నారు.

# 22న నర్మెట్ట ఆయిల్ పామ్ యూనిట్ ప్రారంభోత్సవం

**– 20 నుంచి 22 వరకు రైతు మేళా నిర్వహణ**

**– ప్రారంభోత్సవ కార్యక్రమ వేడుకలపై మంత్రి తుమ్మల సమీక్ష**

రాష్ట్రంలో ఆయిల్ పామ్ సాగు అభివృద్ధి దిశగా మరో కీలక అడుగు పడుతోందని రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. సిద్ధిపేట జిల్లాలోని
నంగునూరు మండలం నర్మెట్ట గ్రామంలో నిర్మించిన ఆధునిక ఆయిల్ పామ్ ప్రాసెసింగ్ యూనిట్‌ను ఈ నెల 22వ తేదీన గౌరవ ముఖ్యమంత్రి గారి చేతుల మీదుగా ఘనంగా ప్రారంభించనున్నట్లు మంత్రి పేర్కొన్నారు. ప్రస్తుతం రాష్ట్రంలో భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో తెలంగాణ ఆయిల్ ఫెడ్ ఆధ్వర్యంలో స్థాపించబడిన రెండు ఆయిల్ పామ్ ప్రాసెసింగ్ మిల్లులు నిర్వహణలో ఉన్నాయని మంత్రి తెలిపారు. ఈ మిల్లుల సమిష్టి సామర్థ్యం గంటకు 120 మెట్రిక్ టన్నులు గా ఉందని చెప్పారు. ఈ ప్రాసెసింగ్ యూనిట్లు ఆయిల్ పామ్ రైతులు పండించే పండ్లను త్వరితగతిన ప్రాసెస్ చేసి వారికి సరైన మార్కెట్ అవకాశాలు కల్పిస్తూ కీలక పాత్ర పోషిస్తున్నాయని వివరించారు. ఈ నేపథ్యంలో తెలంగాణ ఆయిల్ ఫెడ్ సిద్ధిపేట జిల్లాలోని నంగునూరు మండలం నర్మెట్ట గ్రామంలో సుమారు రూ.300 కోట్ల అంచనా వ్యయంతో ఆధునిక ఆయిల్ పామ్ ప్రాసెసింగ్ ఫ్యాక్టరీని నిర్మించిందని మంత్రి తెలిపారు. ప్రారంభ దశలో ఈ యూనిట్ గంటకు 30 టన్నుల (30 ÷ఖఊ) సామర్థ్యంతో పనిచేయనుండగా, భవిష్యత్తులో దీనిని గంటకు 120 టన్నుల (120 ÷ఖఊ) వరకు విస్తరించే విధంగా రూపకల్పన చేసినట్లు చెప్పారు. సుమారు రూ.300 కోట్ల వ్యయంతో నిర్మించిన ఈ ఆధునిక ప్రాసెసింగ్ యూనిట్ ఆయిల్ పామ్ రైతులకు ఎంతో మద్దతుగా నిలవనుందని మంత్రి పేర్కొన్నారు. ఈ యూనిట్ ప్రారంభంతో ఆయిల్ పామ్ సాగు చేస్తున్న రైతులకు ప్రాసెసింగ్, నిల్వ మరియు మార్కెటింగ్ సౌకర్యాలు మరింత సులభంగా అందుబాటులోకి రానున్నాయని మంత్రి తెలిపారు. రైతులు తమ పంటలను నేరుగా ఈ ప్రాసెసింగ్ యూనిట్‌కు తీసుకువచ్చి ప్రాసెస్ చేయించుకునే అవకాశం ఉంటుందని చెప్పారు. ఆధునిక సాంకేతికతతో నూనె తయారీ జరగడం వల్ల నాణ్యత మెరుగుపడటంతో పాటు రైతులకు మెరుగైన ధరలు లభించే అవకాశం ఉంటుందని మంత్రి వివరించారు.

ఈ ప్రారంభోత్సవాన్ని పురస్కరించుకుని వ్యవసాయ మరియు అనుబంధ శాఖల ఆధ్వర్యంలో ఈ నెల 20 నుంచి 22 వరకు మూడు రోజుల పాటు రైతు మేళా నిర్వహించనున్నట్లు మంత్రి తెలిపారు. ఈ మేళాలో ఆధునిక వ్యవసాయ పద్ధతులు, నూతన యంత్రాలు, ఆయిల్ పామ్ సాగు విధానాలు, ఉత్పత్తి పెంపు మార్గాలు, ప్రభుత్వ పథకాలపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు చెప్పారు. వివిధ శాఖల స్టాళ్లు ఏర్పాటు చేసి రైతులకు ప్రత్యక్షంగా సమాచారం అందించనున్నట్లు తెలిపారు.

ఈ కార్యక్రమాల నిర్వహణపై వ్యవసాయ మరియు అనుబంధ శాఖ అధికారులతో మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సమీక్ష సమావేశం నిర్వహించారు. ప్రారంభోత్సవ కార్యక్రమం విజయవంతంగా జరిగేలా అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని అధికారులకు మంత్రి ఆదేశించారు.

# 12న సర్పంచులు, చైర్మన్లు, మేయర్లకు శిక్షణ

ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమంలో భాగంగా ఈనెల 12వ తేదీన సర్పంచులు, మున్సిపల్ వార్డు సభ్యులు, చైర్మన్లు, మేయర్లకు శిక్షణా కార్యక్రమం నిర్వహించ నున్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేసే అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు , 99 రోజుల కార్యాచరణ ప్రణాళికపై పూర్తిస్థాయిలో అవగాహన కల్పించాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణ రావు ఆదేశించారు. జూన్ 12వ తేదీ వరకు నిర్వహించే 99 రోజుల కార్యాచరణ ప్రణాళికలో భాగంగా ఈనెల 12న కొత్తగా ఎన్నికైన స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులకు నిర్వహించే శిక్షణా కార్యక్రమంపై నేడు జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి సమీక్షించారు. పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి ప్రత్యేక ప్రధాన కార్యదర్శి సంజయ్ కుమార్, మున్సిపల్ పరిపాలన కార్యదర్శి టి.కె శ్రీదేవి, సెర్ప్ సీఈఓ దివ్య, ప్రణాళికా శాఖ కార్యదర్శి గౌరవ్ ఉప్పల్ లు ఈ వీడియో కాన్ఫరెన్స్ లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా సి.ఎస్ మాట్లాడుతూ, ప్రజా ప్రతినిధులు, ప్రభుత్వ అధికారులు సమన్వయంతో పని చేస్తేనే ఉత్తమ ఫలితాలు వచ్చి ప్రభుత్వ కార్యక్రమాలు సమర్థవంతంగా అమలవుతాయని రాష్ట్ర ముఖ్యమంత్రి పదే పదే ఉటంకిస్తున్న విషయాన్ని గుర్తు చేశారు. ప్రజలకు ఏవిధంగా నైతే ప్రామాణికమైన ఫలితాలు అందుతాయో, ఆ కోణంలో ఈ శిక్షణా కార్యక్రమం నిర్వహించాలని స్పష్టం చేశారు. రాష్ట్ర ప్రభుత్వ ఎ÷-లాగ్ షిప్ కార్యక్రమాలు, కేంద్ర ప్రాయోజిత పథకాలు , ప్రజా ప్రతినిధుల భాగస్వామ్యం తదితర అంశాలపై స్పష్టమైన అవగాహన కలిగేలా ఉండాలన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా దాదాపు 12,700 గ్రామా పంచాయతీలు, 110 మున్సిపల్ సంస్థలున్నాయని, వీటన్నింటిలో 15000 మంది ప్రజాప్రతినిధులున్నారని వివరించారు. ఈ శిక్షణ కార్యక్రమ ప్రారంభోత్సవానికి మంత్రులు, ఎం.పీ లు , ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు లను కూడా ఆహ్వానించాలని సి.ఎస్ స్పష్టం చేశారు. జిల్లా లోని వివిధ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను తెలిపే ఫోటో ప్రదర్శనను కూడా వేదిక వద్ద ఏర్పాటు చేయాలన్నారు. 99 రోజుల కార్యక్రమంలో భాగంగా ఇప్పటి వరకు ÷ళ్లె క్లియరెన్స్, పారిశుధ్య కార్యక్రమాల నిర్వహణ విజయవంతంగా నిర్వహిస్తున్నందుకు జిల్లా కలెక్టర్లను రామకృష్ణా రావు అభినందించారు. కొత్తగా ఎన్నికైన సర్పంచులు, కౌన్సిలర్లు, కార్పొరేటర్లు,

# కోరుట్ల బిజెపిలో

## ఏవి తల్లీ నిరుడు కురిసిన హిమ సమూహములు?

శివప్రసాద్
మేనేజింగ్ ఎడిటర్

**▪ కోరుట్ల బిజెపి లో కోవర్టులా?**
**▪ బిజెపిలో ఈ రివర్సు రాజకీయాలు ఎందుకు?**

భారతీయ జనతా పార్టీ సాగర మధనం నుంచి ఉద్భవించిన అమృతం.
వెయ్యేళ్ళ పరాయి పాలన నుండి,అణచివేత నుండి, ఆత్మ విస్మృతి నుండి .. సింహ గర్జన తో లేచిన జాతీయ భావ రాజకీయ కెరటం బిజెపి.1977 ఎమర్జెన్సీ కాలంలో జనతా పార్టీలో జనసంఘ్ విలీనమైనది.. మళ్ళీ కొత్తగా ఏప్రిల్ 6 1980 రోజున ముంబాయిలోని "బాంద్రా రిక్లేమేషన్ గ్రౌండ్" లో భారతీయ జనతా పార్టీ పురుడు పోసుకున్నది.1951 లో ప్రారంభమైన జనసంఘ్,1980 సం.లో బిజెపి అవతరణ వరకు జాతీయవాద శక్తులు రక రకాల ఆటుపోట్లను చూస్తూ వచ్చాయి.

**▪ చీకట్లు తొలుగుతాయి, సూర్యుడు ఉదయిస్తాడు, కమలం వికసిస్తుంది**

అంటూ నినదించిన అటల్ బిహారీ వాజ్ పాయ్ గారి నాయకత్వ స్ఫూర్తితో బిజెపి ప్రారంభమైంది.దేశ రాజకీయాలలో ఉనికి కొరకు పోరాటం చేస్తూ వచ్చిన జాతీయ శక్తులు "కోరుట్లలో" కూడా అంతులేని పోరాటం చేసాయి.

### » కోరుట్ల బిజెపి చరిత్ర

1980లో బిజెపి ప్రారంభమైనప్పటి నుండి కోరుట్లలో ప్రముఖ డాక్టర్ కడారి వెంకట్ రావు గారు బిజెపికి, విద్యార్థి శక్తులకు బాసటగా మార్గదర్శకుడుగా ఉండి పనిచేశారు.ముంబైలో ప్రారంభమైన బిజెపి ఆవిర్భావ సభలో కోరుట్ల నుండి అప్పటి ప్రముఖ కిరాణా వ్యాపారి, పద్మశాలి సామాజిక వర్గానికి చెందిన స్వర్గీయ శ్రీ చింతకింది రామచంద్రం గారు తన బృందంతో కలిసి పాల్గొన్నారు.ఆర్ఎస్ఎస్ స్థాపకులు పూజ్యులు స్వర్గీయ శ్రీ కేశవరావు బలిరాం పంత్ హెడ్గేవార్ తో పాటు ఆర్ఎస్ఎస్ శిక్షణ శిబిరంలో పాల్గొన్న స్వర్గీయ శ్రీ కస్తూరి ఎల్లప్ప గారు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోనే మొట్ట మొదటి ఆర్ఎస్ఎస్ శాఖను కోరుట్లలో ప్రారంభించారు.స్వర్గీయ శ్రీ కోడూరి ఈశ్వరయ్య, స్వర్గీయ శ్రీ కొండపాక కిషన్ రావు లాంటి పెద్దల కృషితో కోరుట్లలో ఆర్ఎస్ఎస్, బిజెపి ల ఉనికి వ్యవస్థీకృతమయింది. శ్రీ కొండపాక కిషన్ రావు గారు ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘం వ్యవస్థాపక అధ్యక్షులు.
అపస్ స్థాపన కొరకు శ్రీ కొండపాక కిషన్ రావు గారు తన ఆస్తులను కరిగించుకొని ఉపాధ్యాయ సంఘాన్ని స్థాపించిన ఘనమైన చరిత్ర కోరుట్లది.కోరుట్ల మొదటినుండి మేధావులకు త్యాగజీవులకు ఆలవాలం. ఈరోజున ఉపాధ్యాయులకు ఒక జాతీయ భావ సంఘాన్ని అందించిన కోరుట్ల చరిత్ర అపురూపమైనది.కోరుట్లలో అప్పుడు కాంగ్రెస్ పార్టీ తరువాత బలమైన రాజకీయ శక్తిగా ఉన్న భారతీయ కమ్యూనిస్టు పార్టీ (సి.పి.ఐ) ల మధ్యన బిజెపి ఉనికిని చాటడానికి వేలాదిమంది బిజెపి కార్యకర్తలు లెక్కలేనన్ని త్యాగాలు చేశారు.
కోరుట్ల నుండి మారుమూల గ్రామాలకు నడచి వెళ్ళి, సైకిళ్లపై వెళ్లి ఆర్ఎస్ఎస్ శాఖలను ప్రారంభించిన కార్యకర్తలు ఎందరో జాతీయ భావ వ్యాప్తికి పునాదులు వేశారు.
1978లో కోరుట్లలో ఎబివిపి శాఖ ప్రారంభమైనప్పటి నుండి కాంగ్రెస్, కమ్యూనిస్టులు,తెలుగు దేశం, నక్సలైట్లతో జాతీయ శక్తులు సైద్ధాంతిక పోరు చేస్తూనే వచ్చాయి. రాజకీయ ఉనికి కొరకు పెనుగులాడుతూ వచ్చాయి. రాడికల్ విద్యార్థుల భౌతిక దాడులను ఎదుర్కొంటూ, ప్రాణాలకు తెగించి ఎబివిపి కార్యకర్తలు మారుమూల గ్రామాలలోని హైస్కూల్ స్థాయి వరకు చొచ్చుకు వెళ్లారు.

### ▪ అది సంఘర్షణ కాలం

ఆర్ఎస్ఎస్, బిజెపి, ఎ.బి.వి.పి లతో ప్రభావితమైన వ్యక్తులంతా కలిసి జాతీయ భావ వ్యాప్తికి తీవ్రమైన పోరాటం చేస్తూ వచ్చారు. భౌతిక దాడులు ఎదుర్కొన్నారు.కోరుట్లలో అప్పుడు మెడికల్ ప్రాక్టీస్ ప్రారంభించిన డాక్టర్ వెంకట్ రావు గారు జాతీయ భావ వ్యక్తులకు మార్గ దర్శనం చేస్తూ వచ్చారు.

### ▪ రాడికల్స్ వీరవిహారం


నక్సలైట్ పార్టీ చెందిన "పీపుల్స్ వార్" తొలినాళ్ల లో కోరుట్లలో రాడికల్ విద్యార్థి సంఘం ను ప్రారంభించింది.ఉధృతంగా పనిచేస్తున్న నక్సలైట్ శక్తులు.. జగిత్యాల,కోరుట్ల, మెట్టుపల్లి, రాయికల్,ధర్మపురి లో చుట్టుపక్కల గ్రామాల్లో ఎబివిపి, బిజెపి కార్యకర్తల పై దాడులు చేస్తూ, హత్యా ప్రయత్నాలు చేసాయి.చివరికి నక్సలైట్లు ఇప్పటి జగిత్యాల జిల్లాలోని ఎందరో కార్యకర్తలను హత్యలు చేశారు.రామన్న, గోపన్న, జితేందర్ రెడ్డి, మధుసూదన్ గౌడ్ లు అసువులు బాసిన వారిలో ప్రముఖులు.ఆ సంఘర్షణ కాలంలో కార్యకర్తలకు కోరుట్ల లో డాక్టరు వెంకట్ రావు గారు సైద్ధాంతిక మార్గదర్శనం చేస్తూ వచ్చారు.

### ▪ కే.యూ నాయకుడు డాక్టర్ వెంకట్ రావు

వరంగల్ లో అప్పుడప్పుడే "కాకతీయ యూనివర్సిటీ" రూపుదిద్దుకుంటున్నది. అప్పుడు వరంగల్ లో నక్సలైట్ శక్తుల స్వైర విహారం నడుస్తున్నది.ఆ స్థితిలో 1976-77 సంవత్సరానికి గాను ఎంబిబిఎస్ డాక్టర్ల సంఘానికి డాక్టర్ వెంకట్ రావు ఏబివిపి తరఫున అధ్యక్షునిగా పనిచేశారు."ఆంధ్ర యూనివర్సిటీ విద్యార్థి సంఘ అధ్యక్షునిగా పనిచేసిన శ్రీ ముప్పవరపు వెంకయ్యనాయుడు గారికి సమకాలికునిగా పనిచేసిన డాక్టర్ వెంకట్ రావు, ఏబివిపి వరంగల్ జిల్లా అధ్యక్షుని గా కూడా పనిచేశారు "

### ▪ ఎమర్జెన్సీ వ్యతిరేక పోరాటంలో కోరుట్ల

1975 సంవత్సరంలో కాంగ్రెస్ ప్రధాని శ్రీమతి ఇందిరా గాంధీ గారు దేశంలో ఎమర్జెన్సీ విధించినప్పుడు ఆర్ఎస్ఎస్ "లోక్




సంఘర్షణ సమితి" ప్రారంభించి దేశవ్యాప్తంగా ప్రజాస్వామ్య రక్షణకు తీవ్రమైన పోరాటం చేసింది.లోక్ సంఘర్షణ సమితి విద్యార్థి విభాగమైన "యువ సంఘర్షణ సమితి" ఆంధ్ర రాష్ట్ర కమిటీ సభ్యునిగా డాక్టర్ వెంకట్రావు గారు ఎమర్జెన్సీ వ్యతిరేక విద్యార్థి ఉద్యమానికి నాయకత్వం వహించారు.

### ▪ ఆర్ఎస్ఎస్ శిక్షణ

1975 సంవత్సరంలో వెంకట్రావు గారు ఆర్ఎస్ఎస్ మొదటి సంవత్సరం ఓటిసి చేసారు.
కోరుట్లలో బిజెపి ప్రారంభమైన తరువాత తొలినాళ్లలో బుగ్గారం నియోజకవర్గం నుండి రెండుసార్లు బిజెపి స్టేట్ కౌన్సిల్ మెంబర్ గా బాధ్యతలు నిర్వహించారు.

### ▪ కోరుట్ల బిజెపి త్యాగాల చరిత్ర

కోరుట్లలో పీపుల్స్ వార్ నక్సలైట్ల ఉనికి బలంగా ఉండేది. నిన్నటికి నిన్న సాయుధ పోరు విరమణ చేసిన, మావోయిస్టు పార్టీ సెంట్రల్ మిలిటరీ కమిషన్ చీఫ్ గా పనిచేసిన దేవ్ జీ గా ప్రసిద్ధుడైన శ్రీ తిప్పిరి తిరుపతి, మావోయిస్ట్ ఉద్యమ ప్రస్థానం కోరుట్లలో ప్రారంభం అయింది.మావోయిస్ట్ పార్టీ ఆవిర్భావానికి, ముగింపుకు కోరుట్ల సాక్షిగా నిలిచింది.

**– ఇప్పుడు మావోయిస్టు పార్టీగా పిలవబడుతున్న నక్సలైట్ల "పీపుల్స్ వార్ గ్రూపు" 1980 ఏప్రిల్ 22వ తేదీన ప్రారంభమైంది.**
**– అదే సంవత్సరము 1980 ఏప్రిల్ 4వ తేదీన భారతీయ జనతా పార్టీ ప్రారంభమైంది.**

**▪ సాయుధ మావోయిస్టు ఉద్యమం ఎగిసింది, ముగిసింది.**
**భారతీయ జనతా పార్టీ అప్రతిహతంగా సాగుతూనే ఉంది.బిజెపి, సైద్ధాంతిక పటిష్టత బలం, జాతీయ నిబద్ధతతో ముందుకు సాగుతూనే ఉన్నది**

రాడికల్ ఉద్యమ సంఘర్షణతో సతమతమయ్యే కార్యకర్తలకు డాక్టర్ వెంకట్ రావు తో పాటు సీనియర్ నాయకులు స్పష్టమైన దారి చూపేవారు.నక్సలైట్ల దారి తప్పు అని,ఎప్పటికైనా జాతీయ భావ విప్లవమే ప్రామాణికమని సీనియర్లు చెప్పేవారు.అది నిజమయ్యింది.అంతటి దీర్ఘ దృష్టి గల నాయకుల కేంద్రం కోరుట్ల.జాతీయభావ కార్యకర్తల త్యాగాలకు సార్థకత చేకూరింది,కానీ ఇప్పుడు ఆ ఆదర్శాలకు ఆదరణ తగ్గిందని బిజెపి శ్రేణులు మదనపడుతున్నాయి.

**▪ పీపుల్స్ వార్ నక్సలైట్ పార్టీ ఊపిరి పోసుకున్న జగిత్యాల ప్రాంతములో అసలు బిజెపిలో పని చేయడానికి ఎవ్వరూ ముందుకు రాని సమయం అది. ఆ వాతావరణం లో బిజెపి నిర్మాణానికి త్యాగాలు చేసిన వారి పేర్లు లెక్కలేనన్ని**

చిన్న మెట్టుపల్లి జగన్ మోహన్ రావు ను హత్య చేసి కోరుట్ల ప్రాంతంలో బలమైన శక్తిగా ఉన్న పీపుల్స్ వార్ నక్సలైట్లు కోరుట్ల,మెట్టుపల్లి, ప్రాంతంలో ఎబివిపి, బిజెపి కార్యకర్తలపై ఎన్నో దాడులు చేశారు.కోరుట్లలో నాంపల్లి పై హత్యా ప్రయత్నం, మెట్టుపల్లి లో పూదరి మధుసూదన్ హత్య, ఐలాపూర్ లో శ్రీ కోళ్ల భూమయ్య హత్య. మెట్టుపల్లిలో ఇల్లందుల శ్రీనివాస్ పై, కోరుట్లలో బోయిని వేణు పై హత్యా ప్రయత్నాలు చేసిన పీపుల్స్ వార్ నక్సలైట్ల నుండి కార్యకర్తలను రక్షిస్తూ, స్ఫూర్తిని నింపుతూ పనిచేసిన డాక్టర్ వెంకట్ రావు ను కూడా నక్సలైట్లు టార్గెట్ చేశారు.ఇంకా చాలామంది ఎబివిపి, బిజెపి నాయకులు నక్సలైట్ల దాడులకు బలయ్యారు.డాక్టర్ వెంకట్ రావు గారిని,ఇంకా కొందరు బిజెపి నాయకులను చంపుతామని నక్సలైట్లు గ్రామాల్లో పోస్టర్లు అతికించారు. డాక్టర్ గారు ప్రాక్టీస్ చేస్తున్న క్లినిక్ పై దాడి చేసి చంపాలని కూడా చూశారు. అప్పుడు పోలీసులు ఇద్దరు గన్ మెన్ లతో డాక్టర్ వెంకట్ రావు గారికి రక్షణ కల్పించారు.

### ▪ కోరుట్లది త్యాగాల చరిత్ర

నక్సలైట్ల నాలుగున్నర దశాబ్దాల హింసా పోరాటము తో సతమతమైన జాతీయవాద విద్యార్థులకు, రాజకీయ కార్యకర్తలకు రాజకీయ ఉద్బోధ చేస్తూ డాక్టర్ వెంకట్ రావు నిబద్ధత కలిగిన కార్యకర్తల బృందానికి కేంద్ర బిందువుగా నిలిచారు.డాక్టర్ వెంకట్ రావు తో పాటు, ఎందరో నాయకులు పార్టీకి ఊపిరులూదారు.1985 సంవత్సరంలో తెలుగుదేశం పార్టీతో కుదిరిన ఎన్నికల పొత్తులో మెట్టుపల్లి నియోజకవర్గం నుండి బిజెపి అభ్యర్థిగా పోటీ చేయడానికి స్థానికేతరుడైన శ్రీ చెన్నమనేని విద్యాసాగర్ రావు గారు, స్థానికుడైన స్వర్గీయ కొమిరెడ్డి రాములు గారు టికెట్ కొరకు తీవ్రమైన పోటీ చేస్తున్నప్పుడు, మెట్టుపల్లి కోరుట్ల ప్రాంత కార్యకర్తలు అందరూ డాక్టర్ వెంకట్ రావు గారిని బిజెపి అభ్యర్థిగా ప్రతిపాదించారు. బలమైన వెలమ సామాజిక వర్గానికి చెందిన డాక్టర్ వెంకట్ రావు గారు,తన కుటుంబ బాధ్యతల కారణంగా పోటీకి సుముఖత చూపలేదు. కార్యకర్తల ప్రతిపాదనను డాక్టర్ వెంకట్ రావు సున్నితంగా తిరస్కరించారు.డాక్టర్ వెంకట్ రావు అన్ని సామాజిక వర్గాలతో ఒక జాతీయ శక్తి నిర్మాణం కొరకు, అప్పటి బిజెపి సీనియర్ నాయకులతో కలిసి కోరుట్లలో వ్యూహాత్మకంగా పనిచేశారు.

### ▪ బిజెపి నిర్మాణం

కోరుట్లలో వైశ్య సామాజిక వర్గానికి చెందిన స్వర్గీయ శ్రీ కొత్త ప్రభాకర్ గారిని బిజెపి పట్టణ అధ్యక్షుడిగా, కాపు సామాజిక వర్గానికి చెందిన శ్రీ బండారు రాజేశ్వర్ గారిని కోరుట్ల మండల అధ్యక్షునిగా, పద్మశాలి సామాజిక వర్గానికి చెందిన ప్రముఖ జ్యోతిష్యుడు స్వర్గీయ శ్రీ జక్కుల శంకరయ్య గారిని కోరుట్ల పట్టణ బిజెపి అధ్యక్షునిగా, గౌడ సామాజిక వర్గానికి చెందిన స్వర్గీయ శ్రీ కాయల గంగారాం ను ప్రముఖ బిజెపి నాయకునిగా, బాధ్యతలు అప్పగిస్తూ అన్ని కుల వర్గాల సమ్మేళనంతో పార్టీని పటిష్టంగా మార్చడంలో డాక్టర్ వెంకట్ రావు పాత్ర ముఖ్యమైనది.
కోరుట్ల లో జాతీయవాదం బలపడడానికి కుమ్మరి సామాజిక వర్గానికి చెందిన శ్రీ మామిడిపల్లి గంగారాజం, ముదిరాజ్ సామాజిక వర్గానికి చెందిన శ్రీ వెంకట్ రెడ్డి గంగారాం, శ్రీ భీమనాతి రాజ గంగారాం, పద్మశాలి వర్గానికి చెందిన చింతకింది మురళి, అంబల్ల ధర్మరాజు, ఆడెపు గంగారాం, చిలుక గంగారాం లాంటి త్యాగ జీవులు ఆర్ఎస్ఎస్ ఉనికి కొరకు అలుపెరుగని పనిచేశారు.తర్వాత కాలంలో బిజెపి బలపడడానికి ఇలాంటి పెద్దల కృషి ఎంతో ఉపకరించింది.
ఇలా అన్ని సామాజిక వర్గాలతో జాతీయవాద పూలదండను నేర్పుగా అల్లి, పార్టీని నిర్మించిన ఆనాటి త్యాగాలకు ఇప్పుడు కనీస గౌరవం లేదు.

### ▪ మోడీ చరిష్మా ఒక్కటే దిక్కు

సిద్ధాంతాలు, కృషి,త్యాగాలకు విలువ లేదని, వ్యక్తిగత విలువలను ఇప్పుడు పరిగణన లోనికి తీసుకోవడం లేదని బిజెపి కార్యకర్తలు బహిరంగంగా మాట్లాడుకుంటున్నారు.వ్యక్తి నిర్మాణం తో జాతి నిర్మాణం .. అని సమాజ కార్యములో నిమగ్నమై జీవితాలను త్యాగం చేసిన కార్యకర్తలకు ప్రాధాన్యత లేదు.శతాబ్దాల అణచివేత నుండి తలఎత్తిన హిందూ జాతీయ వాదం ఇప్పుడు భారతదేశంలో ఒక ప్రభలమైనటువంటి భావ శక్తిగా ఎదిగింది.ఈ శక్తి నిర్మాణంలో ఎందరెందరో త్యాగధనులు తమ జీవితాలను తృణప్రాయంగా త్యాగం చేశారు. ఆ మహా యజ్ఞంలో కోరుట్ల కూడా తన వంతు పాత్ర పోషించింది.ఆ త్యాగాలకు డాక్టర్ వెంకట్ రావు లాంటి వారు తగిన ప్రోత్సాహం అందించేవారు. మార్గదర్శనం చేసేవారు. ఆర్ఎస్ఎస్ పరివార క్షేత్రంలో రాజకీయ క్షేత్రమైన బిజెపి ఒక భాగం మాత్రమే.
కానీ రాజకీయ విభాగం అయిన బిజెపిలో పనిచేస్తున్న నాయకులు ఇప్పుడు అన్ని పరివార క్షేత్రాలను శాసించడం అవాంఛిత పరిణామం.రాజకీయ క్షేత్రమైన బిజెపి లో ఏదో ఒక బాధ్యత ఉంటే చాలు నాయకులం అయిపోయినట్టే అని భావించే కొందరు కొత్త తరం కార్యకర్తలకు సిద్ధాంత అవగాహన ఉండడం లేదు. పార్టీ బాధ్యతను పదవి అని భావించి టైం పాస్ చేసే వారు బిజెపి లో పెరిగిపోయారనే మాట నిజమనే భావించే వారు ఎక్కువయ్యారు.
ఇటువంటి వ్యక్తులను కట్టడి చేసి దారిలో పెట్టే డాక్టర్ వెంకట్ రావు లాంటి వాళ్ళ అవసరము ఇప్పుడు కనిపిస్తున్నది.
గ్రామస్థాయి నుండి పార్లమెంట్ స్థాయి వరకు ఎందరెందరో కొత్తవాళ్లు బిజెపి పార్టీలో చేరుతూ వస్తున్నారు. అవసరం తీరిన తర్వాత పార్టీని వదిలి పోతున్నారు.

**▪ ఏ పదవులు ఆశించకుండా, ఎటువంటి లాభాపేక్ష లేకుండా త్యాగాలు చేసి జాతీయభావ నిర్మాణానికి పునాదులు వేసిన పాత కార్యకర్తలు ఇప్పుడు ఎందుకు పనికి రాకుండా పోయామని మౌనంగా విలపిస్తున్నారు**

భారత్ మాతాకీ జై, వందేమాతరం, జైశ్రీరామ్ అని గట్టిగా నినాదాలు ఇవ్వడము ఒక్కటే నాయకత్వ లక్షణమని భావిస్తున్నవారు బిజెపిలో పెరిగిపోయారు.
పార్టీ చరిత్ర, సిద్ధాంతం, త్యాగాలు, వ్యూహాలు ఏమీ తెలియని గాలివాటం కార్యకర్తలు నాయకులు బిజెపి నిండా చేరిపోయారు.అనుశాసనం క్రమశిక్షణ అలవాటిన నిజమైన బిజెపి నాయకులు, కార్యకర్తలు మౌనంగా తిరుగుబాటు జెండా ఎగరవేస్తున్నారు.

**▪ కొత్త కార్యకర్తలు, అధికారంలో ఉన్న నాయకుని పక్కన నిలబడి ఫోటో తీసుకుని సోషల్ మీడియాలో పెట్టుకుంటే చాలు,ఫ్లెక్సీలో బొమ్మ వేసుకుంటే చాలు పార్టీ పనిచేసినట్టే అని, తాము కూడా నాయకులు అయిపోయినట్టే అని భావిస్తున్నారు**

పార్టీ నిర్మాణం అంటే ఏమిటో?. పార్టీ సిద్ధాంతం అంటే ఏమిటో?. తెలియని వారు బిజెపిని ఫక్తు సాధారణ రాజకీయ పార్టీగా మాత్రమే భావిస్తున్నారు.హిందుత్వం నిర్వచనం తెలియని వారు బిజెపి లో నిండి పోయారన్న అభిప్రాయం నిజమే అనిపిస్తున్నది.హిందుత్వము పేరు చెబితే ఓట్లు వస్తాయని,మోడీ నామ జపం చేస్తే అధికారం చేతికి అందుతుందని భావించే వ్యక్తులు పార్టీ నిర్మాణాన్ని విస్మరించారు. సిద్ధాంతం పట్ల అంకితభావం గల కార్యకర్తలు చచ్చినట్టు పార్టీకి పనిచేస్తారని భావించే నాయకులు ఇప్పుడు పార్టీని శాసిస్తున్నారు.ఇప్పుడు బిజెపిలో సిద్ధాంత చర్చలు, అవగాహన సమావేశాలు,శిక్షణా శిబిరాల ఊసే లేదు.

### ▪ బిజెపి భవిష్యత్తు ఏమిటి?

మనం మాట్లాడుతున్నది కోరుట్ల ప్రాంతం గురించి మాత్రమే. జాతీయస్థాయిలో బిజెపి పనితీరు ఎదుగుదల స్పష్టంగా ఉంది, స్ఫూర్తిదాయకంగా ఉంది. కానీ.. కోరుట్ల, మెట్టుపల్లి, జగిత్యాల, ధర్మపురి చుట్టుపక్కల ప్రాంతాల్లో నిర్మాణమైన బిజెపి లో ఇప్పుడు గందరగోళం తాండవిస్తున్నది.
కోవర్టులు అంటూ సీనియర్ కార్యకర్తలను పార్టీ నుండి సస్పెండ్ చేయడం, బి ఫాం లు కూడా ఇవ్వకుండా, పార్టీ సింబల్ తో పోటీ చేయడానికి వీలు లేకుండా చేసి కోవర్టులు అని అనడం బిజెపికి ఆశనిపాతమే.కొత్తగా కోరుట్ల మెట్టుపల్లి జగిత్యాల లో బిజెపి కోవర్టులు అనే మాట వినిపిస్తున్నది.ఎవరు కోవర్టులు.. ఎందుకు కోవర్టులు?.. అనే ప్రశ్నకు బదులు దొరకడం కష్టమే అనిపిస్తుంది.ఒకవేళ, ఎవరైనా కార్యకర్త పార్టీ వ్యతిరేక కార్యక్రమాలు చేస్తే,కోవర్ట్ అని అనిపిస్తే చర్చించే వేదిక కనిపించడం లేదు.

**▪ ఏ సమీక్ష లేకుండా కోవర్ట్ అని ముద్ర వేయడం వల్ల ఆ కార్యకర్తకు,నాయకునికి మాత్రమే నష్టం కాదు.మొత్తం పార్టీకి నష్టం కలుగుతుంది**

దశాబ్దాల పాటు పార్టీతో మమేకమై జీవించిన ఒక నాయకుడు లేదా ఒక కార్యకర్త అకస్మాత్తుగా బిజెపి కోవర్టు ఎలా అయ్యాడు??.
కోవర్ట్ అని అంటున్నది ఎవరు?..జగిత్యాల మున్సిపల్ చైర్ పర్సన్ గా పనిచేసిన శ్రీమతి భోగ శ్రావణి గెలిచింది బి.ఆర్.ఎస్ పార్టీ నుండి. ఆమె బి.ఆర్.ఎస్ పార్టీ నుంచి బయటకు వచ్చిన ఆమె అసలు కోవర్ట్.ఆమె బిజెపి కోరుట్ల మెట్టుపల్లి జగిత్యాల లోని బిజెపి నాయకులను కోవర్ట్ అని సంబోధించడం అత్యంత బాధాకరము.జగిత్యాల జిల్లాలోని ప్రధాన పట్టణమైన కోరుట్లలో బిజెపి ప్రక్షాళన అయ్యిందని ఆమె అనడం ఆశ్చర్యం.ఆమెతో ఇలా పలికిస్తున్నది ఎవరు?.కోవర్టులు అనేవారు పార్టీకి చేసిన నష్టం ఏమిటి?.ఎవరు చెబితే ఆమె ఇలా సీనియర్ బిజెపి నాయకులను కోవర్టులు అని అంటున్నది.

**▪ కోరుట్ల కేంద్రంగా డాక్టర్ వెంకట్ రావు గారు బిజెపిలో క్రియాశీలకంగా పని చేసిన కాలంలో ఎవరైనా కార్యకర్త ప్రవర్తనలో అపశృతులు దొర్లితే ఆ కార్యకర్తను పిలిచి, అపవాదులకు కారణాలు అడిగి వివరణ తెలుసుకుని సమస్యను చక్కదిద్దే వాళ్ళు. ఇప్పుడు ఆ వాతావరణం లేదు**

### ▪ పొరపాట్లు తప్పులు చేస్తున్న కార్యకర్తలను సరిదిద్దే వ్యవస్థ లేదు

తత్వ ఆరాధన నుంచి, వ్యక్తి ఆరాధనకు బిజెపి పార్టీ పరిమితమైపోయింది. అధికారంలో ఉన్న నాయకుని ఆదేశాలే పార్టీ కార్యక్రమాలుగా చలామణి అవుతున్నాయి.
బిజెపి లో సమిష్టి ఆలోచన కనుమరుగయింది. నచ్చని వారిపై చెడు ముద్ర వేసే చెడు ధోరణి బిజెపిలో కనిపిస్తున్నది.

**▪ జగిత్యాల జిల్లా కోరుట్ల మెట్టుపల్లి రాయికల్ ధర్మపురి చుట్టుపక్కల ప్రాంతాల్లో బలమైన బిజెపిలో ఇప్పుడు కార్యకర్తలు నిస్పృహతో దిక్కులు చూస్తున్నారు**

మార్గ నిర్దేశం చేసేవారు లేక, స్థానికంగా ప్రభుత్వ శాఖలలో పని ఉంటే సహకరించే నాయకత్వం లేక గ్రామస్థాయి కార్యకర్తలు అయోమయానికి గురవుతున్నారు.

**▪ గ్రామ స్థాయి కార్యకర్తకు మున్సిపల్,మండల స్థాయిలో ఏదైనా పని ఉంటే ఎవరి దగ్గరికి వెళ్ళాలో తెలియని పరిస్థితి నెలకొన్నది**

**▪ కరడుగట్టిన బిజెపి కార్యకర్తకు ప్రభుత్వపరంగా ఏ చిన్న పని ఉన్నా అభిమానం చంపుకొని ఇతర పార్టీ నాయకుల సహాయం తీసుకోవలసిన దుర్గతి పట్టిందని వాపోతున్నారు**

ఒకనాడు ధర్మపురి సర్పంచుగా శ్రీ రేణికుంట రాధాకిషన్, వెల్గటూర్ జెడ్పిటిసిగా శ్రీ దురిశెట్టి వెంకటయ్య, రాయికల్ సర్పంచ్ గా డాక్టర్ తురగ రాజరెడ్డి గారు స్వంత ప్రతిభతో గెలిచారు.మెట్టుపల్లి ఇబ్రహీంపట్నంలో జెడ్పిటిసిలుగా, మేడిపల్లి ఎంపీపీ ప్రెసిడెంట్ గా, ఎంపీటీసీలుగా, నీటి సంఘాల అధ్యక్షులుగా, జగిత్యాల జిల్లాలోని పలు గ్రామాల సర్పంచులుగా సొంత బలంతో గెలిచిన నాయకులంతా ఇప్పుడు ఎక్కడా కనిపించడం లేదు.

**▪ బిజెపికి ఎలాంటి హవా లేని కాలంలో, కోరుట్లలో స్వర్గీయ శ్రీ సిరిపురం గంగారాం గారు సర్పంచ్ గా పోటీచేశారు.స్వర్గీయ శ్రీమతి కల్లెడ లింబక్క కోరుట్ల ఉప సర్పంచ్ గా పనిచేసింది**

బిజెపిని నిలబెట్టడం కొరకు స్థానిక బిజెపి కార్యకర్తలు తీవ్రంగా కృషి చేశారు.డాక్టర్ వెంకట్ రావు తో పాటు ఇతర నాయకులు పరిస్థితులను అనుకూలంగా మార్చుకుంటూ పార్టీలు నిర్మించారు.బలమైన పద్మశాలి సామాజిక వర్గము నుండి స్వర్గీయ శ్రీ ఉషకోల శంకరయ్య గారు, ఇంకొక బలమైన గంగపుత్ర సామాజిక వర్గము నుండి స్వర్గీయ శ్రీ రుత్తె గంగారాం గారు కోరుట్ల లో వార్డ్ మెంబర్లుగా పనిచేశారు.
మెట్టుపల్లిలో శ్రీ చెన్నమనేని విద్యాసాగర్ రావు గారు ఎమ్మెల్యేగా గెలవక ముందే బిజెపి ఈ ప్రాంతంలో తన ఉనికిని చాటింది.
బొంబాయి,పూనే, అహ్మద్ నగర్, భివాండి, సోలాపూర్ లాంటి నగరాలకు ఉపాధి కొరకు వలస పోయిన కోరుట్ల పరిసర ప్రాంతాల వారు ఆర్ఎస్ఎస్ తో సంబంధాలు ఏర్పరచుకొని కోరుట్ల చుట్టుపక్కల ప్రాంతాల్లో ఆర్ఎస్ఎస్ శాఖలను స్థాపించారు.
చెన్నమనేని విద్యాసాగర్ రావుకు ఈ వలస కార్మికుల కృషి చాలా ఉపయోగపడింది. మెట్టుపల్లి ఎమ్మెల్యేగా విద్యాసాగర్ రావు గెలుపులో ఈ కార్మికుల సహకారము మరువలేనిది.
నక్సలైట్ల ఎన్నికల బహిష్కరణ పిలుపును ఎదుర్కొని ప్రాణాలకు తెగించి మెట్టుపల్లిలో చెన్నమనేని విద్యాసాగర్ రావు గారిని ఎమ్మెల్యేగా గెలిపించుకున్న చరిత్ర బిజెపి కార్యకర్తలది.విద్యాసాగర్ రావు తరువాత స్వర్గీయ శ్రీ తుమ్మల వెంకట రమణా రెడ్డి అలియాస్ దాము గారు మెట్టుపల్లి ఎమ్మెల్యేగా పనిచేశారు.విద్యాసాగర్ రావు, దాము ఎమ్మెల్యే పదవి కొరకు పోటీ చేసినప్పటికీ ప్రతి కార్యకర్త తానే అభ్యర్థిగా భావించుకొని అంకితమై పనిచేసిన చరిత్ర బిజెపి ది.అలాంటి ఉన్నత ఆశయాలతో పనిచేసే అంకితమైన కార్యకర్తలు ఇప్పుడు తమకు తగిన గుర్తింపు లేదని కుమిలిపోతున్నారు. కనీసం పలకరించేవారు లేక పాత,కొత్త బిజెపి కార్యకర్తలు దిగులు పడుతూ వేదన చెందుతున్నారు.

### ▪ కార్యకర్తలు .. కరివేపాకులు

సంస్థాగత వ్యవస్థ నుంచి వ్యక్తిగత ఆధిపత్యం వైపు పయనించిన తర్వాత జగిత్యాల జిల్లా బిజెపి ఇప్పుడు చౌరస్తాలో నిలబడింది. ఏ వైపు వెళ్లాలో తెలియక కార్యకర్తలు నాలుగు రోడ్ల కూడలి లో ఎటువైపు వెళ్ళాలో తెలియక సతమతమవుతున్నారు.

**▪ డబ్బులు మాత్రమే ప్రామాణికమైతే, పార్టీ కి అంకితమై ఎందుకు పనిచేయాలని, పనికి విలువేముందని బిజెపి కార్యకర్తలు భావిస్తున్నారు. పార్టీ కొరకు, సిద్ధాంత స్థిరీకరణ కొరకు కుటుంబాన్ని మరిచి స్వార్థాన్ని మరిచి దశాబ్దాల తరబడి పని చేసిన కార్యకర్తల యొక్క త్యాగాలు చివరికి డబ్బు అనే అంశం దగ్గర వెనుకబడిపోతున్నాయి**

ఇన్నాళ్లు మేము పనిచేసాము పోటీ చేయడానికి పార్టీ టిక్కెట్లు ఇవ్వండి అని అడిగితే కోవర్టులు అంటూ అవమాన పరుస్తున్న సంఘటనలు బిజెపి పార్టీని సంకటం లోనికి నెట్టివేస్తున్నాయి.ఎన్నికల్లో పోటీ చేయడానికి నీ దగ్గర డబ్బు ఎంత ఉంది, చూపించు అని అడిగితే కార్యకర్తలు నివ్వెర పోతున్నారు.

**▪ రాత్రింబవళ్లు పార్టీ కొరకు పనిచేసి జీవితాలను వ్యర్థం చేసుకునే బదులు, డబ్బు సంపాదనలో పడిపోవడమే,సంపాదించుకోవడమే ఉత్తమమేమో అని బిజెపి కార్యకర్తలు ఇప్పుడు తలలు పట్టుకుంటున్నారు. చేతులు కాలాక ఆకులు పట్టుకుంటే ఏమి లాభమని విలపిస్తున్నారు**

వయస్సు ఉడిగి.. కరివేపాకు లాగా మారిపోయిన తమ జీవితాల పట్ల జాలి చూపుకోవడానికి కూడా పనికిరాని స్థితికి బిజెపి కార్యకర్తలు విసిరి వేయబడ్డారు.

### ▪ దేశం చుట్టూ ఉచ్చులు.. పార్టీ లోపల చిచ్చులు

భారతీయ జనతా పార్టీ ఆ సేతు హిమాచలము ఒక సైదాంతిక భావావేశంతో పనిచేస్తూ వస్తున్నది.
ఇప్పుడున్న అన్ని రాజకీయ పార్టీలలో బిజెపి విలక్షణమైనది. అటువంటి విలక్షణమైన బిజెపి ఇప్పుడు స్థానికంగా ఎక్కడికక్కడ అవలక్షణాలతో కునారిల్లుతున్నది.

**▪ కేంద్రంలో బిజెపి అధికారంలో ఉండాలంటే స్థానిక కార్యకర్తల యొక్క దన్ను అవసరం. కేంద్రంలో బిజెపి ప్రభుత్వము ఉండడం కొరకు మోడీ కొరకు అన్ని అవమానాలను అనుభవించి కూడా బిజెపి కార్యకర్తలు పనిచేస్తున్నారు**

అధికారం మాత్రమే ముఖ్యమని భావించే నాయకులు కార్యకర్తల యొక్క అంకితభావాన్ని కించపరుస్తున్నారు. కిందిస్థాయి కార్యకర్తలకు ఆదర్శాలు వల్లించే నాయకులు తాము మాత్రము స్వార్థ ఎత్తుగడలతో అధికారం అనుభవిస్తున్నారు.

### ▪ కార్యకర్తల త్యాగం .. నాయకుల అధికారం

గ్రామాలలో అధికార ప్రత్యర్థి పార్టీలను ఎదిరించి నిలుచున్న కార్యకర్తలను ప్రేమతో పలకరించే వారు లేరు. ఏమైనా అవసరముంటే నేనున్నానని అనునయించే నాయకుడు కనిపించక బిజెపి కార్యకర్తలు వేదన పడుతున్నారు. ఈ వేదన తీర్చే నాయకులు ఎవరు?

### ▪ కార్యకర్తల త్యాగాన్ని గుర్తించని పార్టీ కనుమరుగవ్వడం ఖాయం

హిందుత్వ వాదన,జాతీయ భావం, మోడీ చరిష్మా ఉంటే చాలు ఎన్నికల్లో గెలవచ్చనే వారు బిజెపి వైపు చూస్తున్నారు. బిజెపిలో "గెస్ట్ రోల్ నాయకులు" ఎక్కువైపోయారు.పాత నాయకులకు చెక్ పెట్టడానికి, ఇలా గెస్ట్ నాయకులను పార్టీలోకి జొప్పిస్తున్నారని బహిరంగ విమర్శలు బయలుదేరినాయి.

**▪ నిన్నటి వరకు బిజెపికి శత్రువుగా పనిచేసిన ప్రత్యర్థి పార్టీ నాయకుడు అకస్మాత్తుగా బిజెపిలో చేరి బిజెపి పార్టీని శాసిస్తున్నారు.**

ఇటువంటి సీజనల్ నాయకులను ఎందుకు చేరదీస్తున్నారని కార్యకర్తలు గొంతెత్తి అడుగుతున్నారు.
కోరుట్లలో అంకితభావంతో పనిచేసిన నిస్వార్థ నాయకుడు డాక్టర్ వెంకట్ రావు లాంటివారు మళ్లీ రావాలని బిజెపి కార్యకర్తలు కోరుకుంటున్నారు.
నైరాశ్యానికి గురవుతున్న కార్యకర్తలను ఓదార్చి భారతీయ జనతా పార్టీ రాష్ట్ర, కేంద్ర నాయకత్వాలు తమ పార్టీ యంత్రాంగాన్ని పరుగులెత్తించకపోతే 2029 పార్లమెంటు ఎన్నికలలో కార్యకర్తల యొక్క నిస్పృహ పార్టీకి శాపంగా మారే అవకాశం ఉన్నది.తమను అవమాన పరుస్తున్న ప్రస్తుత నాయకులను రాబోయే ఎన్నికల్లో ఓడించి తీరతామని ప్రైవేటు సంభాషణలో తమ ఆక్రోశాన్ని వెల్లగక్కుతున్నారు.కార్యకర్తల నిరసన, ఆవేశం బిజెపికి భవిష్యత్తులో నష్టం కలిగిస్తుందేమో అని నిజమైన బిజెపి కార్యకర్తలు బాధపడుతున్నారు. కోవర్టులు అని ముద్ర వేస్తున్న నాయకులే నిజమైన కోవర్టులని బిజెపి నాయకులు బహిరంగంగా మీడియాలో మాట్లాడుతున్నారు.

**▪ హిందుత్వ నినాదం, జాతీయవాదం, మోడీ పై అభిమానం కూడా పక్కనపెట్టి రాబోయే ఎన్నికలలో నాయకులను ఓడించి తీరుతామని ఆవేశంతో బహిరంగంగా మాట్లాడుతున్నారు**

రాబోయే అసెంబ్లీ పార్లమెంట్ ఎన్నికలలో కార్యకర్తల పనితీరు బిజెపికి నష్టం కలిగించే ప్రమాదం ఉన్నది.
కేంద్రంలో మోడీకి ప్రతి ఒక్కొక్క ఎం.పి అవసరం కాబట్టి. కేంద్రంలో పార్టీ పరిస్థితి సున్నితంగా ఉంది కాబట్టి, నాయకులను ఏమీ అనలేని నిస్సహాయ స్థితిలో పార్టీ నాయకత్వం ఉందేమోనని కార్యకర్తలు ఎవ్వరికి వారే సర్ది చెప్పుకుంటున్నారు.

### ▪ పసిడిరెక్కలు విసిరికాలం

పారిపోయిన జాడలేవీ? ఏవి తల్లీ! నిరుడు కురిసిన **హిమ సమూహములు?**
అంటూ, బిజెపి కార్యకర్తలు శ్రీశ్రీ వ్రాసిన ఖడ్గసృష్టి లోని కవితను గానం చేసుకుంటూ తిరుగుతున్నారు.గత కాలపు నైతిక విలువలు గల నాయకులు కావాలని డాక్టర్ వెంకట్ రావు లాంటి వ్యక్తుల మార్గదర్శనం అవసరమని కోరుట్ల బిజెపి కార్యకర్తలు కోరుకుంటున్నారు.

**▪ తక్కువేమీ మనకు రాముడు ఒక్కడుండు వరకు అనుకుంటూ, జై శ్రీరామ్ అంటూ వలస నాయకులు రాబోయే ఎన్నికలను తలచుకొని చిందులు వేస్తున్నారు**

ఆదర్శ వాదానికి, అవకాశవాదానికి మధ్యన బిజెపి పార్టీ నలిగిపోతున్నది. ఈ సంఘర్షణ సంక్షోభంగా మారకూడదని బిజెపి శ్రేయోభిలాషులు కోరుకుంటున్నారు.


# ఆస్కార్ వేదికపై ‘యుద్ధం’ చేస్తున్న ఇరానీ డైరెక్టర్ ఎవరంటే?


**కరపత్రం ప్రతినిధి ప్రత్యేక ప్రతినిధి**

సొంత దేశం ఆయన్ను ‘దేశద్రోహీ’ అంటోంది. శత్రు దేశం ఆయన్ను ‘విఘాతకుడు’ అంటోంది.
ఇరాన్ పై అమెరికా యుద్ధం చేస్తోంది.. ఓ ఇరానియన్ డైరెక్టర్ ఆస్కార్ అవార్డ్ కోసం హాలివుడ్ లో సమరం చేస్తున్నాడు..
కళ కళగా బతికితే ఆయన సినిమాకు ఆస్కార్ రావచ్చు.
శత్రువు శత్రువు మిత్రుడైతే రాకపోవచ్చు.
ఏదైనా మరో 5 రోజుల్లో తేల్తుంది. అసలు నిజం బయటికొస్తుంది.
ఆయన పేరు జఫర్ పనాహి. తీసిన సినిమా “ఇట్ వాజ్ జస్ట్ ఆన్ యాక్సిడెంట్”. ఇదో అద్భుత పొలిటికల్ థ్రిల్లర్.
జఫర్ పనాహీ ఎలాంటోడంటే..చాలా మామూలోడు. మనవాళ్ల మాదిరి ఓ 5,6 వందల కోట్లతోనో, వేయి, 1500 మందిని బందెల దొడ్లో తోలో సినిమాలు తీయడు. ఇరాన్ ప్రస్తుత పాలకులు ఇంట్లోంచి కదిల్తే కాళ్లు విరిచేస్తామంటే కూడా లెక్కచేయకుండా కొంపలోనే కెమెరా పెట్టి సినిమా తీసి ప్రపంచం మీదికి వదిలారు. ఇంకో ముచ్చటేమిటంటే.. ఈ సినిమాను ఇరాన్- ఆస్కార్ కు నామినేట్ చేయలేదు. ఫ్రాన్స్ చేసింది.

పేదరికం నుంచి ప్రపంచ వేదిక వరకు..

జఫర్ పనాహి ఓ నిరుపేద. 1960లో ఇరాన్‌లోని మియానేలో ఓ కార్మికుడి ఇంట్లో పుట్టారు. తండ్రి పెయింటర్. తల్లి గృహిణి. డబ్బుకి ఎప్పుడూ ఇబ్బందే. పేదలందరి లాగే జాఫర్ బతుకు కూడా. చిన్నతనంలో కూలీనాలీ చేశాడు. ఇక్కట్ల మధ్యే బాల్యం గడిపాడు. 12 ఏళ్ల వయసులో పలకాబలపం పక్కన బెట్టి నూనె బావుల్లో పన్జేశాడు. సినిమాలంటే పిచ్చి. పొట్టబోసుకోగా మిగిలిన డబ్బుతో సినిమాలు, షికార్లూ చేసేవారు.
20 ఏళ్ల వయసులో ఇరాన్-ఇరాక్ యుద్ధంలో సైనికుడి అవతారమెత్తి యుద్ధ రంగాన్ని సినీ ట్రైనింగ్ సెంటర్ గా మార్చుకున్నాడు. అప్పుడు తీసిన రీళ్లు ఆ తర్వాత చాలా కాలం పనికివచ్చాయి. యుద్ధం ముగిశాక, ఇరాన్ లెజెండరీ దర్శకుడు అబ్బాస్ కియారోస్తామి వద్ద శిష్యరికం చేశారు. 1995లో ‘ది వైట్ బెలూన్’తో దర్శకుడిగా ప్రపంచ దృష్టిని ఆకర్షించారు.




ప్రస్తుతం ఆయనదో విచిత్ర పరిస్థితి. ఓవైపు సొంత ప్రభుత్వం ఆయనను ‘దేశద్రోహి’గా ముద్ర వేసి జైల్లో పెడుతోంది. మరోవైపు శత్రుదేశం అమెరికా ఆయనను తమ ‘రాజకీయ ప్రయోజనాల’ కోసం వాడుకుంటే పోలా అనుకుంటోంది.
పనాహి కుటుంబమంతా ఆర్టిస్టులే. ఆయన భార్య పేరు తహెరెహ్ సైదీ. నర్సు. కాలేజీ రోజుల్లోనే ప్రేమలో పడి 1983లో పెళ్లి చేసుకున్నారు. ఇద్దరు పిల్లలు. కొడుకు పేరు పనాహ్ పనాహి. ఆయనా దర్శకుడే. ఆయన తీసిన ‘హిట్ ది రోడ్’ అనే సినిమా 2021లో సూపర్ హిట్.
కుమార్తె సోల్మాజ్ పనాహి థియేటర్ ఆర్టిస్టు. సినిమాలంటే మక్కువ. ప్రభుత్వ వేధింపులతో పడలేక ఇరాన్ విడిచి ఫ్రాన్స్‌కు పోయి పారిస్‌లో ఉంటోంది.
పనాహీ జీవితం చాలా సాదాసీదా. పెద్ద కార్లు, ఖరీదైన భవంతులు లేవు. తక్కువ ఖర్చుతో (లో-బడ్జెట్) సినిమాలు తీయడం ఆయనకు మంచినీళ్లు తాగినంత పని. సంపాదన కంటే మాట్లాడే హక్కుకే మక్కువ చూపుతారు.
పనాహీ సినిమాలన్నీ చిల్లర బతుకుల చుట్టూతానే తిరుగుతాయి. అవే అసాధారణ కథలంటారాయన. అంతమాత్రాన దేశద్రోహేమీ కాదు. దేశభక్తీ మెండే. “సర్కార్ ను మార్చడానికి సమరం చేయాల్నా” అని ప్రశ్నిస్తారు. ఒంటరిగా ఉంటే వంద ప్లస్ ఐదు, అమెరికా లాంటి శత్రువొస్తే 105 అంటాడు. అమెరికా వంటి విదేశీ శక్తుల జోక్యమెందుకూ అని నిలదీస్తారు. యుద్ధం వల్ల నష్టపోయేది సామాన్య ప్రజలేనంటాడు. మొత్తం మీద ఆయన శాంతి కాముకుడు, యుద్ధ వ్యతిరేకి.

జైలు తలుపుల మధ్య కెమెరా..

పనాహీపై 2010లో ఇరాన్ రిజీమ్ 20 ఏళ్ల సినిమా నిషేధం పెట్టింది. దేశం విడిచిపారిపోవద్దని మెలికా పెట్టింది. మొన్నటి మొన్న అంటే 2025 డిసెంబరులో మళ్లీ ఓ ఏడాది జైలు శిక్ష. 2026 మార్చి 10 నాటికి కూడా ఇల్లే కారాగారం. అయినా, ఆయన సినిమాలు ఆగలేదు. ‘క్రియేటివ్ రిసిస్టెన్స్’ అనే పద్ధతిని విడనాడలేదు.
అదెలాగంటే.. విలేఖరిలా మారతాడు, ఇంటికి అతిథులు వచ్చినట్టు, వేడుక జరుగుతున్నట్టు నటిస్తూ పక్కన కెమెరాలు పెట్టి షూటింగ్ చేస్తారు.
ఐఫోనో, మరొకటో చేతబట్టి తీసిన ఫుటేజీని వీ పి ఎన్ ద్వారా క్లౌడ్‌కు పంపుతారు. పోలీసులు మెమరీ కార్డులు వెతికినా ఏమీ దొరకకుండా చేస్తారు. కుటుంబ సభ్యుల్నే నటులుగా మారుస్తాడు. “టాక్సీ” సినిమాలో మేనకోడలు, “క్లోజ్డ్ కర్టెన్”లో సహచరులే నటులు. 2011లో “దిస్ ఈజ్ నాట్ ఏ ఫిలిం”ను యు ఎస్ బి స్టిక్‌లో పెట్టి కేక్‌లో దాచి ఫ్రాన్స్‌కు పంపారు.
ప్రపంచంలోని మూడు ప్రధాన ఫిల్మ్ ఫెస్టివల్స్ (కాన్, బెర్లిన్, వెనిస్)లో ఆయనకు ఆయనే సాటి. కాన్‌లో “ఇట్ వాజ్ జస్ట్ ఆన్ యాక్సిడెంట్”కు పామ్ డి ఓర్ (2025), బెర్లిన్‌లో “టాక్సీ”కు గోల్డెన్ బేర్ (2015), వెనిస్‌లో “ది సర్కిల్”కు గోల్డెన్ లయన్ (2000) అవార్డులు వచ్చాయి.

ఇక, “ఇట్ వాజ్ జస్ట్ ఆన్ యాక్సిడెంట్” గురించి..
2025లో విడుదలైన ఈ పొలిటికల్ థ్రిల్లర్, ఇరాన్ జైళ్లలో రాజకీయ ఖైదీల అనుభవాలను కళ్లకు కట్టినట్టు చూపిస్తుంది. ఇరాన్ వీధుల్లో ఒక చిన్న




రోడ్డు ప్రమాదం... కారు మెకానిక్ వాహిద్ (వాహిద్ మొబస్సేరి) సహాయం చేయడానికి వెళ్తాడు. కానీ, ప్రమాదానికి గురైన వృద్ధుడి (మరియం అఫ్షారీ) కృత్రిమ కాలు చేసే ‘క్లిక్-క్లాక్’ శబ్దం వాహిద్‌ను గతానికి తీసుకెళ్తుంది. దశాబ్దాల క్రితం జైలులో కళ్లకు గంతలు కట్టి చిత్రహింసలు చేసిన అధికారి ఇతనేనని నమ్ముతాడు.
వాహిద్ తోటి మాజీ ఖైదీలతో కలిసి వృద్ధుడిని కిడ్నాప్ చేస్తాడు. ఒక నిర్మానుష్య ప్రాంతంలో ‘రహస్య విచారణ’ జరుగుతుంది. వృద్ధుడు తాను మామూలు పౌరుణ్ణని, కాలు యుద్ధంలో పోయిందని మొరపెట్టుకుంటాడు. కానీ ఖైదీలు “అతనే” అని, “కాదేమో” అని వాదించుకుంటూ కొంతసేపు మానసిక యుద్ధం చేసుకుంటారు. ముగింపులో వృద్ధుడు తానే అధికారి (ఎక్బాల్) అని ఒప్పుకుంటాడు, కానీ “నేను చేసింది నిబంధనల ప్రకారమే. నన్ను చంపితే అమరుణ్ణి అవుతా, వదిలేస్తే మామూలు మనిషిగా బతుకుతా” అంటాడు. ప్రతీకారం తీర్చుకోవాలా, వదిలేయాలా? అనే సందిగ్ధతలో సినిమా ముగుస్తుంది.
ఆస్కార్ బరిలో ఈ చిత్రానికి పోటీ తీవ్రం. అంతర్జాతీయ చిత్రంలో నార్వే “సెంటిమెంటల్ వ్యాల్యూ”, బ్రెజిల్ “ది సీక్రెట్ ఏజెంట్”తో పోటీ. స్క్రీన్‌ప్లేలో “సిన్నర్స్” (16 నామినేషన్లు) బలమైన ప్రత్యర్థి. విమర్శకులు పనాహి రచనా నైపుణ్యానికి, భావోద్వేగాలకు బ్రహ్మరథం పడుతున్నారు. 70% స్క్రీన్‌ప్లే విభాగంలో పనాహీ సినిమా పోటీ పడుతోంది. ఎందుకంటే అక్కడ ‘రచనా నైపుణ్యానికి’ ప్రాధాన్యత ఉంది. “ప్రభుత్వం వేరు, కళాకారుడు వేరు” అనే భావన. ఫ్రాన్స్ లాబీయింగ్ అదనపు బలం. ఒకవేళ గెలిచినా, పనాహి హాజరుకాకపోవచ్చు. రాజకీయాలకు కళకు మధ్య జరుగుతున్న పోటీ ఇది. ఆస్కార్ ఓటర్లు ‘స్ట్రగుల్ బిహైండ్ ది లెన్స్’ను (ఈ సినిమా తీయడానికి పడిన కష్టాన్ని) కళగానే చూస్తారని నమ్మిక. ప్రస్తుత యుద్ధ నేపథ్యంలో ఈ సినిమాకు అవార్డు ఇస్తే, అది ఇరాన్ ప్రజలకు మద్దతు. రాజకీయాలు కళను అణచివేస్తే? అప్పుడు మార్చి 15 ‘రాజకీయాలే కారణమే’ అని చర్చ.
65 ఏళ్ల పనాహీకి సినిమా తీయడం ఊపిరి. “వారు నా చేతులకు సంకెళ్లు వేయగలరు, కానీ ఆలోచనలకు కాదు” అని చెబుతారు. ఒకవేళ ఆస్కార్ వస్తే, అది ఇరాన్ సినిమా చరిత్రలో మైలురాయి. యుద్ధ మేఘాల మధ్య శాంతి సందేశం. రాకపోయినా, పనాహీ కెమెరా ఆగదు. తెలుగు పాఠకులకు ఆయన కథ ఒక స్ఫూర్తి. పేదరికం, ఆంక్షలు ఎదుర్కొని కూడా కళతో అణచివేతపై పోరాడవచ్చునని మరోసారి నిరూపించవచ్చు. ఈలోపు మీరు”ఇట్ వాజ్ జస్ట్ ఆన్ యాక్సిడెంట్” సినిమాను మూబిలో చూడండి.

## లక్ష్యసాధనే ధ్యేయంగా పోటీ పరీక్షలకు సిద్ధమవ్వాలి

**- గజ్వేల్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఒక రోజు వార్క్ షోప్ లో నిపుణులు**

**గజ్వేల్, మార్చి 10 కరపత్రం ప్రతినిధి**
స్థానిక గజ్వేల్ ప్రభుత్వ స్వయంప్రతిపత్తి డిగ్రీ కళాశాలలో పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్ విభాగం మరియు ఐాఖజ సంయుక్త ఆధ్వర్యంలో “సివిల్ సర్వీసెస్ మరియు ఇతర పోటీ పరీక్షల వ్యూహాలపై అవగాహన” అనే అంశంపై ఒక రోజు వర్క్‌షాప్‌ను మంగళవారం ఘనంగా నిర్వహించారు ముఖ్య అతిథి ప్రసంగం ఈ కార్యక్రమానికి రిసోర్స్ పర్సన్‌గా విచ్చేసిన పేస్ ఇన్ఫర్మాటిక్ సెంటర్ డైరెక్టర్ మరియు ప్రముఖ సాఫ్ట్ స్కిల్ ట్రైనర్ బి. శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ



డిగ్రీ 2వ మరియు 3వ సంవత్సరం విద్యార్థులు ఇప్పుడే తమ కెరీర్‌ను మలుచుకోవడానికి సరైన సమయమని అన్నారు. సివిల్ సర్వీసెస్‌లో విజయం సాధించడానికి అవసరమైన ప్రాథమిక అంశాలు, సమయ పాలన మరియు సాఫ్ట్ స్కిల్స్ ప్రాధాన్యతను ఆయన వివరించారు నిర్వహణ మరియు పర్యవేక్షణ ఈ కార్యక్రమం కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ నిఖత్ అంజుమ్ అధ్యక్షతన జరిగింది విద్యార్థులు ఇటువంటి సదస్సులను ఉపయోగించుకుని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. ఈ వర్క్‌షాప్‌ను పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్ విభాగం అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ టి. కవిత సమర్థవంతంగా నిర్వహించి, విద్యార్థులకు పోటీ పరీక్షలపై ఉన్న సందేహాలను నివృత్తి చేసే ప్రయత్నం చేశారు.లిలిసదస్సు ముఖ్యాంశాలు:
డిగ్రీ పూర్తి కాకముందే సివిల్స్ ప్రిపరేషన్ ప్రారంభించే విధానం. మారుతున్న పరీక్షా సరళికి అనుగుణంగా వ్యూహాల మార్పు.గ్రామీణ నేపథ్యం ఉన్న విద్యార్థులు పోటీ పరీక్షల్లో రాణించేందుకు మెళకువలు.ఈ కార్యక్రమంలో పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్ విభాగం అధ్యాపకులు, ఐాఖజ సిబ్బంది మరియు విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు.

## కుషాయిగూడలో ఘనంగా రేణుక ఎల్లమ్మ తల్లి -- జమదగ్ని స్వామి కల్యాణ మహోత్సవం

**- ముఖ్య అతిథిగా మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలం గౌడ్ హాజరు**

**కుత్బుల్లాపూర్, మార్చి 10 కరపత్రం ప్రతినిధి**
కుషాయిగూడలోని శ్రీశ్రీశ్రీ రేణుక ఎల్లమ్మ తల్లి -- జమదగ్ని స్వామివారి కల్యాణ మహోత్సవ కార్యక్రమం భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆలయ కమిటీ ఆహ్వానం మేరకు కుత్బుల్లాపూర్ మాజీ శాసనసభ్యులు కూన శ్రీశైలం గౌడ్ ముఖ్య అతిథిగా హాజరై అమ్మవారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రేణుక ఎల్లమ్మ తల్లి కృపాకటాక్షాలు ప్రజలందరిపై ఉండాలని, ఆయురారోగ్యాలతో సుఖసంతోషాలతో ప్రతి కుటుంబం అభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు. భక్తులు భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తున్న ఇలాంటి ధార్మిక కార్యక్రమాలు సమాజంలో ఐక్యతను పెంపొందిస్తాయని ఆయన అన్నారు. అనంతరం ఆలయ అర్చకులు, ఆలయ కమిటీ సభ్యులు శ్రీశైలం గౌడ్ గారిని శాలువాతో సత్కరించి, అమ్మవారి తీర్థప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, స్థానిక గౌడ సంఘం ప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## మేడ్చల్‌లో రేణుక ఎల్లమ్మ దేవి విగ్రహ ప్రతిష్టాపనలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలం గౌడ్

**- అమ్మవారి ఆశీస్సులతో ప్రజలు ఆయురారోగ్యాలతో సుఖసంతోషాలతో ఉండాలని ఆకాంక్ష**

**కుత్బుల్లాపూర్, మార్చి 10 కరపత్రం ప్రతినిధి**
మేడ్చల్ పట్టణంలో నిర్వహించిన శ్రీశ్రీశ్రీ రేణుక ఎల్లమ్మ దేవి విగ్రహ ప్రతిష్టాపన మహోత్సవం భక్తిశ్రద్ధల మధ్య ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ఆలయ కమిటీ ఆహ్వానం మేరకు కుత్బుల్లాపూర్ మాజీ శాసనసభ్యులు కూన శ్రీశైలం గౌడ్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా శ్రీశైలం గౌడ్ అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులను



ఉద్దేశించి మాట్లాడుతూ, రేణుక ఎల్లమ్మ తల్లి ఆశీస్సులు అందరికీ లభించి ప్రజలు ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో జీవించాలని ఆకాంక్షించారు. సమాజంలో శాంతి, సౌభ్రాతృత్వం నెలకొని ప్రతి కుటుంబం అభివృద్ధి చెందాలని ప్రార్థించారు. కార్యక్రమం అనంతరం ఆలయ అర్చకులు, ఆలయ కమిటీ సభ్యులు కలిసి కూన శ్రీశైలం గౌడ్ ని శాలువాతో సత్కరించి, అమ్మవారి తీర్థప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, స్థానిక గౌడ సంఘం ప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, స్థానిక ప్రజలు మరియు భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. అమ్మవారి విగ్రహ ప్రతిష్టాపన సందర్భంగా ఆలయ పరిసరాలు భక్తులతో కళకళలాడాయి. భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించి అమ్మవారి ఆశీస్సులు పొందారు.

## ముఖ్యమంత్రి సహాయ నిధి పేదల ఆరోగ్యానికి అండ

**ఎన్టీఆర్ నగర్ మహిళకు రెండో విడుతగా రూ.75 వేల ఎల్ఓసీ అందజేత -- ఎమ్మెల్యే కె.పి. వివేకానంద్**

**కుత్బుల్లాపూర్, మార్చి 10 కరపత్రం ప్రతినిధి**
పేద ప్రజలకు ఆరోగ్య భరోసా కల్పించడంలో ముఖ్యమంత్రి సహాయ నిధి కీలక పాత్ర పోషిస్తుందని బీఆర్ఎస్ పార్టీ విప్, కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కె.పి. వివేకానంద్ అన్నారు. మంగళవారం చింతల్‌లోని ఎమ్మెల్యే కార్యాలయంలో ఎన్టీఆర్ నగర్ ప్రాంతానికి చెందిన బాణాల ప్రమీల ఆరోగ్య చికిత్స కోసం ముఖ్యమంత్రి సహాయ నిధి (జవీ=ఖీ) నుంచి ఎల్ఓసీ మంజూరు చేయాలంటూ ఎమ్మెల్యేను ఆశ్రయించారు. ఆమె కుటుంబం ఎదుర్కొంటున్న ఆర్థిక ఇబ్బందులు, ఆరోగ్య పరిస్థితిని గమనించిన ఎమ్మెల్యే కె.పి. వివేకానంద్ స్పందించి ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా రెండో విడుతగా రూ.75,000 ఎల్ఓసీ మంజూరు చేయించి చెక్కును అందజేశారు. ఇదివరకు మొదటి విడుతగా రూ.1,00,000 ఇప్పటికే మంజూరైన విషయం తెలిసిందే. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఆపదలో ఉన్న నిరుపేదలకు ముఖ్యమంత్రి సహాయ నిధి ఎంతో ఉపయుక్తంగా ఉంటుందని తెలిపారు. తీవ్రమైన ఆరోగ్య సమస్యలు ఎదుర్కొంటున్న పేద కుటుంబాలకు ఈ నిధి ఆర్థిక భరోసా కల్పిస్తుందని పేర్కొన్నారు. ప్రజలు అవసరమైనప్పుడు ధైర్యంగా తమను సంప్రదించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ కిషన్ రావు, బీఆర్ఎస్ సీనియర్ నాయకులు కిషోర్ చారి, యూత్ అధ్యక్షుడు దుడిమెట్ల సోమేశ్ యాదవ్, ప్రధాన కార్యదర్శి సత్తిరెడ్డి, సదానంద్, నసీర్, ఆంజనేయులు, జయం చారి, వెంకటేష్, రమణరెడ్డి, బొంబాయి శ్రీనివాస్, కళ్లెం శ్రీనివాస్, నరసింహ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## గాజులరామారం సర్కిల్‌లో ప్రజా పాలనా ప్రగతి ప్రణాళిక కార్యక్రమం

**-ఇంటింటికీ చెత్త సేకరణపై ప్రత్యేక దృష్టి**
**- చెత్త ఇవ్వని ఇళ్ల గుర్తింపు, నివాసితులకు అవగాహన**

**కుత్బుల్లాపూర్, మార్చి 10 కరపత్రం ప్రతినిధి**
గాజులరామారం సర్కిల్ పరిధిలో నిర్వహిస్తున్న 99 రోజుల ప్రజా పాలనా ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా ఐదో రోజు ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమాలు నిర్వహించారు. షెడ్యూల్ ప్రకారం చేపట్టిన ఈ కార్యక్రమంలో భాగంగా చెత్త ఆటోలకు చెత్త ఇవ్వని కుటుంబాలను గుర్తించే కార్యక్రమంను అధికారులు నిర్వహించారు. ఈ కార్యక్రమం సూరారం గ్రామం, హెచ్ఎంటీ సొసైటీ, షాపూర్‌నగర్, దేవేందర్ నగర్, సుభాష్ చంద్రబోస్ నగర్ కాలనీ, పీపీ నగర్ కాలనీల్లో నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి చెత్త సేకరణ నిర్వహిస్తూ, పారిశుధ్య కార్మికులకు చెత్తను






అందజేయని ఇళ్లను అధికారులు గుర్తించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న అధికారుల బృందం నివాసితులకు చెత్తను సరైన విధంగా పారవేయాల్సిన అవసరాన్ని వివరించారు. మున్సిపల్ పారిశుధ్య వ్యవస్థలో ప్రజల భాగస్వామ్యం ఎంతో కీలకమని తెలియజేస్తూ, ప్రతి ఇంటి నుండి చెత్తను క్రమం తప్పకుండా చెత్త ఆటోలకు ఇవ్వాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ కమిషనర్ శ్రీపాద రామేశ్వర్, పారిశుధ్య అధికారులు, సిబ్బంది, కాలనీ నివాసితులు, యూసీడీ ఆర్పీలు, స్వయం సహాయక సంఘాల (గాఎ+) సభ్యులు, గాజులరామారం సర్కిల్ పరిధిలోని కాలనీ సంక్షేమ సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు. పారిశుధ్య పరిరక్షణలో ప్రజలు బాధ్యతగా వ్యవహరిస్తేనే నగరాన్ని శుభ్రంగా ఉంచడం సాధ్యమవుతుందని అధికారులు ఈ సందర్భంగా తెలిపారు. ప్రజలు మున్సిపల్ సిబ్బందికి సహకరించి ఇంటింటికీ చెత్త సేకరణ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

## మల్లికార్జున స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు

కుత్బుల్లాపూర్ నియోజకవర్గం దుండిగల్‌లోని శ్రీ శ్రీ శ్రీ గొల్ల కేతమ్మ బలిజ మేడలమ్మ సమేత మల్లికార్జున స్వామి దేవాలయంలో మంగళవారం ప్రత్యేక పూజా కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఆలయ కమిటీ ఆహ్వానం మేరకు జరిగిన ఈ కార్యక్రమంలో మాజీ పార్లమెంట్ సభ్యులు అంజన్ కుమార్ యాదవ్ పాల్గొనగా, ఆయనతో కలిసి కుత్బుల్లాపూర్ కాంగ్రెస్ నాయకులు, మాజీ టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నర్సారెడ్డి భూపతి రెడ్డి కూడా ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించి, భక్తులకు ఆశీర్వాదాలు అందించారు. ఆలయ అభివృద్ధి కోసం కమిటీ చేస్తున్న సేవలను అభినందిస్తూ, భక్తులకు మరింత సౌకర్యాలు కల్పించే దిశగా చర్యలు తీసుకోవాలని సూచించారు. దేవాలయం స్థానిక ప్రజలకు ఆధ్యాత్మిక కేంద్రంగా కొనసాగాలని ఆకాంక్షించారు.

## ఘనంగా శ్రీ మహంకాళి అమ్మవారి ఆలయ వార్షికోత్సవ వేడుకలు

**గజ్వేల్ మార్చి 10, కరపత్రం ప్రతినిధి**
సిద్దిపేట జిల్లా గజ్వేల్ శ్రీ మహంకాళి అమ్మవారి ఆలయం వార్షికోత్సవం వేడుకలు మంగళవారం ఘనంగా నిర్వహించారు గత మూడు రోజులుగా ఆలయంలో విశేష పూజా కార్యక్రమాలు నిర్వహిస్తూ, రాజ శ్యామలాదేవి కాలభైరవ రాహు కేతువుల ప్రతిష్ట, అమ్మవారికి వెండి కిరీటం అలంకరణ, ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి భక్తులకు తీర్థప్రసాదాలతో పాటు మహా అన్నప్రసాద కార్యక్రమం నిర్వహించారు, ఆలయ వార్షికోత్సవ వేడుకల్లో పాల్గొని అమ్మవారిని దర్శించుకున్న, గజ్వేల్ ప్రజ్ఞపూర్ మున్సిపల్ మాజీ చైర్మన్ రాజమౌళి,డాక్టర్ లింగం,కొమరవెల్లి శంకరయ్య మాట్లాడుతూ అమ్మ దయ ఉంటే అంతా మంచి జరుగుతుందని ఆలయ వార్షికోత్సవ వేడుకలకు సహకరించిన ప్రతి ఒక్కరికి అమ్మవారి అనుగ్రహం ఉంటుందని అన్నారు, పురోహితుల నంద బాల శర్మ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ దైవ భక్తి కలిగి ఉండాలని దైవ నామ స్మరణతోనే మానవ జీవితానికి ముక్తి కలుగుతుందని అన్నారు, ఈ కార్యక్రమంలో కాల్వ శ్రీధర్, కైలాస ప్రభాకర్,పెద్ద ఎత్తున భక్తులు తదితరులు పాల్గొన్నారు